# వ్యభిచారం నేరం కాదు

- స్వచ్ఛంద లైంగిక వృత్తి నేరం కాదు
- స్వచ్ఛంద వృత్తిలో ఉన్నవారిని వేధించకూడదు
- బలవంతపు షెల్టర్లు, ఫోటోల బహిర్గతం నిషిద్ధం
- అందరికీ ఆధార్‌తో సంక్షేమ పథకాలు కల్పించాలి
- వ్యభిచార మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి



02


# విశాల భారతి

తెలుగు దినపత్రిక

30-05-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 145




## రైతు డిస్కమ్ పేరుతో రేవంత్ కుట్ర

- రైతు డిస్కమ్ పేరుతో రైతులను ప్రభుత్వం దగా చేస్తోంది
- డిస్కమ్ ప్రైవేటీకరణ, మీటర్ల ఏర్పాటుకు యత్నం
- డిస్కమ్ నష్టాలకు, బకాయిలకు ప్రభుత్వమే కారణం
- నిజమైతే ముందుగా పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలి
- వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

విద్యుత్ సంస్థల్లో ఆంధ్రా పెత్తనం ఆపి, తెలంగాణ వారికే ప్రాధాన్యతనివ్వాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా రైతు డిస్కమ్ ఏర్పాటు చేయాలన్న రేవంత్ రెడ్డి సర్కారు ప్రతిపాదనపై తీవ్ర దుమారం రేగుతోంది. ఈ అంశంపై తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం రణరంగంగా మారింది.

మిగతా 4లో..




## సర్‌తో బీజేపీ కుట్ర

- ప్రక్రియపై పూర్తి అవగాహన పెంచుకోవాలి
- పేదలు, వలస కార్మికుల ఓట్లు తొలగకుండా చూడాలి
- నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించాలి
- పార్టీ కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలి

02

# అంగట్లో డబుల్ బెడ్‌రూంలు



- నోటరీ పత్రాలతో నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల విక్రయాలు
- లబ్ధిదారుల ఇబ్బందులను ఆసరాగా చేసుకున్న బ్రోకర్ల దందా
- ప్రభుత్వం విధించిన విక్రయ నిషేధాన్ని బేఖాతరు
- తనిఖీల లోపంతో అక్రమార్కులకు ప్రోత్సాహం
- రిజిస్ట్రేషన్ లేని కొనుగోళ్లతో కొనుగోలుదారులకు చిక్కులు
- ఆకస్మిక తనిఖీలు, బాధ్యులపై కఠిన చర్యలు

03

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** నోటరీ పత్రాల ద్వారా జరుగుతున్న ఈ క్రయవిక్రయాలు చట్టవిరుద్ధమని తెలిసినా, బ్రోకర్లు, దళారులు లాభార్జనే ధ్యేయంగా ఈ దందాకు తెరలేపారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ గృహాలు అర్హులకు దక్కకుండా, స్వార్థపరుల చేతుల్లోకి వెళ్లడం విచారకరం. హైదరాబాద్ మహానగరంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాల కోసం ప్రభుత్వం 15,650 డబుల్ బెడ్‌రూం ఇళ్లను కొల్లూరులో అందుబాటులోకి తెచ్చింది. 2023 సంవత్సరంలో కంప్యూటరైజ్డ్ లక్కీ డ్రా పద్ధతిని అనుసరించి పారదర్శకంగా లబ్ధిదారులకు ఈ ఇళ్లను కేటాయించారు. ఇక్కడ నివసించే ప్రతి కుటుంబానికి మౌలిక వసతులు కల్పిస్తూనే, మరోవైపు ఈ ఆస్తుల బదలాయింపు లేదా విక్రయాలపై కఠినమైన నిషేధం విధించారు. కానీ, నగరంలోని దూర ప్రాంతాల్లో వృత్తి వ్యాపారాలు చేసుకునే లబ్ధిదారులు, పని ప్రదేశానికి ఇక్కడికి రాకపోకలు కష్టతరమని భావించి, గృహాలను వదులుకునేందుకు సిద్ధపడుతున్నారు. ఈ పరిస్థితిని అదనుగా తీసుకున్న అసాంఘిక శక్తులు, అమాయక లబ్ధిదారులను ప్రలోభపెడుతూ ప్లాట్ల క్రయవిక్రయాలను ప్రోత్సహిస్తున్నాయి.

> సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలంలోని కొల్లూరులో వెలసిన ఆసియాలోనే అతిపెద్ద డబుల్ బెడ్‌రూం నివాస సముదాయం అక్రమదారులకు అడ్డాగా మారుతోంది. నిరుపేదల సొంతింటి కలను నిజం చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి గండి కొడుతూ, నిబంధనలను తుంగలో తొక్కి ఈ ప్లాట్ల అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పటాన్‌చెరు సర్కిల్, తెల్లాపూర్ డివిజన్ పరిధిలో ఉన్న ఈ భారీ ప్రాజెక్టులో లబ్ధిదారులు సొంత అవసరాల పేరుతో చేస్తున్న విక్రయాలు అధికారుల నిఘా వైఫల్యానికి అద్దం పడుతున్నాయి.



## చేతులు తడిపితే డ్రైవింగ్ లైసెన్స్

- పోర్టల్ ఉన్నా, దళారుల హవా కొనసాగుతోంది
- సిబ్బంది-ఏజెంట్ల కుమ్మక్కు బయటపడింది
- నేరుగా వెళ్లే పౌరులను వేధిస్తున్నారు
- పనుల కోసం ఇష్టానుసారంగా వసూళ్లు
- అనర్హులకు డ్రైవింగ్ లైసెన్సుల జారీ
- బయోమెట్రిక్, టెస్ట్ డ్రైవ్‌లో దళారులదే పైచేయి

05

## గద్దెనెక్కాక గద్దలా మారిన రేవంత్



- రేవంత్ పాలనలో దోపిడీ రాజ్యమని విమర్శ
- 80శాతం ధాన్యం కొనుగోలు ప్రకటన అబద్ధమని వెల్లడి
- హమాలీ, బ్యాగుల ఖర్చులను రైతులపైనే రుద్దుతున్నారు
- ధాన్యం కొనుగోళ్లపై బహిరంగ చర్చకు సిద్ధం
- ఎరువుల పంపిణీ, వ్యాట్ తగ్గింపులో విఫలం
- మంత్రుల తీరు బాధ్యతారహితమని ఆగ్రహం

03

## రైతును చీకట్లోకి నెట్టే ప్రయత్నమే

- 3 గంటల కరెంట్ సరిపోతుందన్న వ్యాఖ్యలపై అభ్యంతరం
- ఇది రేవంత్ సర్కారు రైతు వ్యతిరేక ధోరణి
- 24 గంటల విద్యుత్‌తో వ్యవసాయాన్ని బలోపేతం చేశాం
- రైతుల కష్టం తెలియని వారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారు
- ఎరువులు, పంట కొనుగోళ్లలో కాంగ్రెస్ విఫలం
- రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసే యత్నం

03



## సీమాంధ్రులపై రేవంత్ కన్నేసారా?



- సెటిలర్ల ఓట్లను ఆకర్షించే కాంగ్రెస్ వ్యూహం
- బీఆర్ఎస్ కంచుకోటను ఛేదించే ఎత్తుగడ
- బీఆర్ఎస్ నుంచి వారిని తమ వైపు తిప్పకునే ప్రయత్నం
- ఎన్టీఆర్ ద్వారా టీడీపీ సానుభూతిపరుల ఆకర్షణ
- బీఆర్ఎస్ తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డుకునే యత్నం
- జీహెచ్ఎంసీ పీఠాన్ని శాసించనున్న ఈ నిర్ణయం

02

## సవాల్‌ను స్వీకరించే దమ్ముందా లేదా కేటీఆర్?



03

- చర్చకు సిద్ధమా అని కేటీఆర్‌ను మంత్రి నిలదీశారు
- బీఆర్ఎస్ కంటే ఎక్కువ ఇళ్లు కట్టామని పొంగులేటి క్లెయిమ్
- కాంగ్రెస్ ఎక్కువ కడితే పోటీకి దూరంగా ఉంటారా అని ప్రశ్న
- ఒక్కో డబుల్ బెడ్‌రూం ఏడు ఇందిరమ్మ ఇళ్లకు సమానమని కేటీఆర్ వాదన

# వ్యభిచారం నేరం కాదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సెక్స్ వర్కర్ల హక్కులే ప్రాధాన్యంగా.. దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు సంచలనంగా మారింది. లైంగిక వృత్తిని ఎంచుకున్న వారికి, బలవంతంగా ఈ మార్గంలోకి నెట్టబడిన వారికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించాలని, స్వచ్ఛందంగా ఈ వృత్తిలో ఉన్నవారిని గౌరవంగా చూసుకోవాలని కోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, గౌరవప్రదమైన జీవనం పొందే అధికారం ప్రతి ఒక్కరికీ వర్తిస్తుందని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఏళ్ల తరబడి అణచివేతకు గురవుతున్న ఈ వర్గం ప్రజలకు భరోసా కల్పిస్తూ, న్యాయస్థానం జారీ చేసిన మార్గదర్శకాలు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. స్వచ్ఛందంగా లైంగిక వృత్తిని ఎంచుకున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించడం, వారిని వేధించడం వంటి చర్యలు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ప్రకటించింది. బలవంతపు వ్యభిచారం, మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన బాధ్యత పోలీసులదే అయినప్పటికీ, వృత్తిపరంగా స్వచ్ఛందంగా ఉన్న వారిని ఇబ్బందులకు గురిచేయకూడదని సూచించింది. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన మేజర్లు తమ జీవనోపాధి కోసం ఏ వృత్తిని ఎంచుకోవాలనేది వారి వ్యక్తిగత నిర్ణయమని కోర్టు అభిప్రాయపడింది. కేవలం లైంగిక వృత్తిలో ఉన్నారనే కారణంతో వారిని నేరస్తులుగా చూడటం తగదని, చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేసింది. చట్ట అమలు సంస్థలు చేపట్టిన దాడుల సమయంలో సెక్స్ వర్కర్లను బలవంతంగా రెస్క్యూ హోమ్స్ లేదా ప్రభుత్వ షెల్టర్లకు తరలించవద్దని ధర్మాసనం ఆదేశించింది. అకస్మాత్తుగా



నిర్వహించే దాడుల్లో వారిని బంధించడం వల్ల వారి ఉపాధి దెబ్బతినడమే కాకుండా, సామాజికంగా మరింత వెలివేతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ, బాధితుల హక్కులను కాపాడటమే అధికారుల ముందున్న ప్రధాన లక్ష్యం కావాలని కోర్టు ఉద్ఘాటించింది. బలవంతపు వృత్తిలోకి నెట్టబడిన వారిని మాత్రమే కాపాడాలి తప్ప, స్వచ్ఛందంగా ఉన్న వారిని శిక్షించడం చట్టం దృష్టిలో ఆమోదయోగ్యం కాదు. లైంగిక వృత్తిలో ఉన్న వారి ఫొటోలు, వీడియోలు చిత్రీకరించి మీడియాకు అందించడం వారి వ్యక్తిగత గౌరవానికి తీవ్ర భంగకరమని కోర్టు పేర్కొంది. గుర్తింపును బహిర్గతం చేయడం వల్ల వారు సమాజంలో గౌరవంగా జీవించే అవకాశాన్ని కోల్పోతున్నారని, మీడియా సంస్థలు బాధితుల వివరాలు, చిత్రాలను ప్రసారం చేయరాదని కఠిన ఆదేశాలు జారీ చేసింది. ప్రసార మాధ్యమాలు, వార్తా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, వారి గోప్యతను కాపాడాలని సూచించింది. గౌరవప్రదమైన జీవనం సాగించే హక్కు ఆర్టికల్ 21 కింద వారికి కూడా సంపూర్ణంగా దక్కుతుందని ధర్మాసనం పునరుద్ఘాటించింది. గుర్తింపు కార్డులు లేని కారణంగా సంక్షేమ పథకాలు అందడం లేదనే ఫిర్యాదులను కోర్టు తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంది. నివాస ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా, సెక్స్ వర్కర్లందరికీ తక్షణమే ఆధార్ కార్డులు జారీ చేయాలని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. గుర్తింపు పత్రాలు ఉంటేనే ప్రభుత్వ పథకాలు, వైద్య, ఆరోగ్య సౌకర్యాలు పొందే వీలు కలుగుతుందని కోర్టు గుర్తించింది. ఏ ఒక్కరూ కనీస వసతులకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆధార్ కార్డు జారీ చేయడం ద్వారా వారిని ప్రధాన స్రవంతిలో భాగం చేసే అవకాశం ఉందని న్యాయస్థానం ఆశాభావం వ్యక్తం చేసింది. మానవ అక్రమ రవాణా చేసే ముఠాలపై ఉక్కుపాదం మోపాలని, బాధితులను కాపాడాలని అధికారులకు సుప్రీంకోర్టు దిశానిర్దేశం చేసింది. ముఖ్యంగా అభం శుభం తెలియని మహిళలు, చిన్నారులను బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి నెట్టే మాఫియాను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. అక్రమ రవాణా చేసే ముఠాల పనితీరును అడ్డుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పోలీసులకు సూచించింది. బాధితులను రక్షించి, వారికి అవసరమైన పునరావాసం కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోర్టు తన తీర్పులో పేర్కొంది. సెక్స్ వర్కర్ల పట్ల సమాజంలో ఉన్న దృక్పథం మారాలని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. వివక్ష, వేధింపులు లేని వాతావరణంలో వారు జీవించేలా చూడటం ప్రతి పౌరుడి బాధ్యతని గుర్తు చేశారు. చట్టపరమైన రక్షణ కల్పిస్తూనే, సామాజికంగా వారికి గౌరవం దక్కేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించింది. వృత్తిపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్న వారి కోసం ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాలు, ఆరోగ్య పరీక్షలు అందుబాటులో ఉంచాలని కోర్టు ఆకాంక్షించింది. వారి పట్ల పోలీసుల వ్యవహారశైలి మానవీయంగా ఉండాలని, కఠినంగా కాదు అని స్పష్టం చేసింది. తీర్పును అమలు చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కేంద్ర హోం శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలని కోర్టు కోరింది. ప్రతి రాష్ట్రంలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, సెక్స్ వర్కర్ల సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించింది. ఈ కమిటీలో సంబంధిత వర్గాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఉండాలని పేర్కొంది. వృత్తిలో కొనసాగుతున్న వారికి లీగల్ ఎయిడ్ అందించడం ద్వారా న్యాయపరమైన సలహాలు, రక్షణ లభించేలా చూడాలని సూచించింది. కమిటీ సిఫార్సుల మేరకు సంక్షేమ చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. గతంలో పోలీసుల దాడులు, కేసులు, జరిమానాల భయంతో సెక్స్ వర్కర్లు తీవ్ర భయాందోళనలకు గురయ్యేవారని కోర్టు గమనించింది. ప్రస్తుత తీర్పుతో ఆ భయం తొలగిపోతుందని, గౌరవంగా జీవించే అవకాశం కలుగుతుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆధార్ కార్డు సౌకర్యం కల్పించడం వల్ల వారు ఆర్థికంగా పుంజుకునే అవకాశం ఉంది. వైద్య సహాయం, ఆరోగ్య బీమా వంటి పథకాలను వారికి కూడా వర్తింపజేయడం ద్వారా వారి ఆయుష్షు పెంచవచ్చని కోర్టు ఆశించింది. చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణలో భాగంగా ఈ తీర్పు ఒక కీలక మైలురాయిగా నిలిచిపోతుంది.




# సీమాంధ్రులపై రేవంత్ కన్నేసారా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయ చిత్రపటంలో గ్రేటర్ హైదరాబాద్ నగరం అనితరసాధ్యమైన శక్తి కేంద్రంగా వెలుగొందుతోంది. ఉమ్మడి రాష్ట్ర చరిత్ర నుండి వలస వచ్చి ఇక్కడ స్థిరపడిన లక్షలాది మంది ఓటర్లు నగరంలోని కీలక నియోజకవర్గాల్లో విజయావకాశాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారు. విభజన కాలపు అనిశ్చితి, భయాందోళనల నుండి బయటపడిన ఈ వర్గం కాలక్రమేణా మారుతున్న రాజకీయ పరిణామాలకు అనుగుణంగా తమ మద్దతును మారుస్తూ వచ్చారు. ముఖ్యంగా గత దశాబ్ద కాలంలో బీఆర్ఎస్ రాజకీయ వ్యూహాలకు ఈ ఓటర్లే ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ద్వారా ఈ సంక్లిష్ట రాజకీయ సమీకరణాల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. ఇది కేవలం ఒక విగ్రహావిష్కరణ మాత్రమే కాకుండా, గ్రేటర్ హైదరాబాద్‌పై పట్టు సాధించే లక్ష్యంతో చేపట్టిన సుదీర్ఘ వ్యూహాత్మక అడుగుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్యమైన కదలికలకు తెరలేపింది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కాలంలో కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ సీమాంధ్రులను ప్రధాన లక్ష్యంగా చేసుకుని చేసిన ప్రసంగాలు అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. దీని ఫలితంగా 2014 ఎన్నికల్లో నగరంలోని అత్యధిక స్థానాల్లో టీడీపీ-బీజేపీ కూటమి ఘనవిజయం సాధించింది. అయితే, అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత కేసీఆర్ శైలి పూర్తిగా మారింది. సెటిలర్ల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, వారిని ఆకట్టుకునేలా పాలనను సాగించారు. ఆ వ్యూహం ఫలితంగానే టీడీపీ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా బీఆర్ఎస్ గూటికి చేరారు. తమకు ఎదురులేదనే సంకేతాలను ప్రజల్లోకి బలంగా పంపడంలో గులాబీ పార్టీ సఫలీకృతమైంది. ఈ రాజకీయ చతురత వల్ల 2018 శాసనసభ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలోని మెజారిటీ స్థానాలు బీఆర్ఎస్ ఖాతాలో చేరాయి. తెలంగాణ సెంటిమెంట్‌ను పక్కనపెట్టి, అభివృద్ధి మంత్రాన్ని జపించడం ద్వారా ఈ ఓటర్ల మనసు గెలుచుకోవడంలో కేసీఆర్ అప్పట్లో కృతకృత్యులయ్యారు. 2023లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం వీచినా, గ్రేటర్ హైదరాబాద్‌లోని సెటిలర్లు మాత్రం బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపడం గమనార్హం. ఆ ఎన్నికల్లో సైతం దాదాపు 30 శాతం పైగా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవడానికి ఈ సామాజిక వర్గమే ప్రధాన కారణం. దశాబ్ద కాలంగా బీఆర్ఎస్ రూపొందించిన ఈ బలమైన కంచుకోటను ఛేదించాలని భావించిన రేవంత్ రెడ్డి, దానికి విరుగుడుగా కీలక ఎత్తుగడ వేశారు. హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న మైత్రీవనం జంక్షన్ వద్ద 23 అడుగుల ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం వెనుక కాంగ్రెస్ బలమైన ఆశలు ఉన్నాయి. తెలంగాణవాదుల నుండి స్వల్ప వ్యతిరేకత ఎదురవుతున్నా, ఏమాత్రం వెనకడుగు వేయకుండా రేవంత్ ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. ప్రతిపక్షాల విమర్శలను లెక్కచేయకుండా, తన రాజకీయ లక్ష్య సాధనలో



ఆయన దృఢంగా ముందుకు సాగుతున్నారు. ఎన్టీఆర్ కేవలం ఆంధ్ర ప్రాంతానికి మాత్రమే పరిమితం కాదని, తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక అని రేవంత్ చేసిన వ్యాఖ్యలు ఆ వర్గంలో కొత్త ఆశలను చిగురింపజేశాయి. తద్వారా పాత టీడీపీ సానుభూతిపరులను కాంగ్రెస్ వైపు ఆకర్షించడం ఈ వ్యూహం వెనుక ఉన్న అంతరార్థం. బీఆర్ఎస్ మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ రగిల్చే అవకాశాన్ని ముందుగానే గుర్తించిన రేవంత్, దీనిని అడ్డుకోవడంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ తమకు అండగా ఉంటే, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవనే భరోసాను సీమాంధ్రులకు కల్పించడంలో ఈ నిర్ణయం కీలక పాత్ర పోషిస్తోంది. క్షేత్రస్థాయిలో సీమాంధ్ర ఓటర్లు బీఆర్ఎస్ పట్ల వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న వాతావరణాన్ని కాంగ్రెస్ తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తోంది. నగరంలో ఒకప్పుడు బలంగా ఉన్న టీడీపీ ఓటు బ్యాంక్‌ను తమవైపు తిప్పుకోవడమే రేవంత్ ప్రధాన ఉద్దేశ్యం. బీఆర్ఎస్ ఎన్నికల సమయంలో మాత్రమే సెటిలర్లను వాడుకుని, ఆ తర్వాత నిర్లక్ష్యం చేస్తోందనే వాదనలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకున్న రేవంత్ రెడ్డి, తనదైన శైలిలో గ్రేటర్ రాజకీయాలను మలుపు తిప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ వ్యూహం గ్రేటర్ రాజకీయాల్లో పెను మార్పులకు కారణం కావచ్చు. బీఆర్ఎస్ ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్న సెటిలర్లు గనుక కాంగ్రెస్ పక్షాన నిలిస్తే, అది గులాబీ పార్టీకి కోలుకోలేని దెబ్బ కానుంది. ఇప్పటికే ఉన్న 150 వార్డుల జీహెచ్ఎంసీ గణాంకాలను పరిశీలిస్తే, సుమారు 40 నుండి 50 వార్డుల్లో వీరి ఓటు కీలకంగా ఉంది. ఈ ఓటు బ్యాంక్ గనుక మళ్లితే గ్రేటర్ పీఠం దక్కించుకోవడం కాంగ్రెస్‌కు ఏమాత్రం కష్టం కాదు. ఈ సమీకరణాలను బేరీజు వేసుకునే రేవంత్ పావులు కదుపుతున్నారు. మొత్తం మీద చూస్తే, రేవంత్ రెడ్డి వేసిన ఈ 'ఆంధ్ర సెంటిమెంట్' విరుగుడు స్కెచ్ గ్రేటర్ హైదరాబాద్ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. ఇది కేవలం విగ్రహావిష్కరణ కాకుండా, ఓటర్ల మనోభావాలను ప్రభావితం చేసే రాజకీయ ఆయుధంగా మారింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుమారు 25 శాతం పైగా ఉన్న ఈ సెటిలర్ల నిర్ణయాత్మక ఓటు, తదుపరి ఎన్నికల ఫలితాలను ఏ రకంగా శాసిస్తుందో చూడాల్సిందే. కాంగ్రెస్ వేసిన ఈ పాచిక ఎంతవరకు ఫలిస్తుందో, ఓటర్లు దేనికి ప్రాధాన్యత ఇస్తారో తెలియాలంటే మరికొన్ని నెలల సమయం అవసరం. రేవంత్ రెడ్డి రాజకీయ పరిణతి, వ్యూహరచన రాబోయే రోజుల్లో ఎంతటి మార్పులను తీసుకువస్తాయనేది తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర అంశంగా నిలిచింది. వ్యూహాత్మక అడుగులు వేయడంలో రేవంత్ చూపిస్తున్న చొరవ పార్టీకి సానుకూల ఫలితాలను తెస్తుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. నగరంలో రోజురోజుకూ మారుతున్న ఈ పరిణామాలు బీఆర్ఎస్ వర్గాల్లో కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. ఏళ్ల తరబడి అల్లుకున్న నెట్‌వర్క్, ఓటు బ్యాంక్ చెదిరిపోతాయనే భయం గులాబీ దళంలో కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి చేస్తున్న ఈ ప్రయత్నం సఫలం అయితే, రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది. సెటిలర్ల ఓటు బ్యాంకు తమకు శాశ్వతం కాదనే విషయం బీఆర్ఎస్‌కు అర్థమవుతోంది. నగరంలో పట్టు నిలుపుకోవాలంటే కొత్త వ్యూహాలను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఆ పార్టీకి ఏర్పడింది. కేవలం పాత పథకాలతోనే నెట్టుకొస్తామనుకుంటే ముప్పు తప్పదని రాజకీయ పండితులు హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ వేస్తున్న అడుగులు బీఆర్ఎస్ ఆధిపత్యానికి సవాలుగా పరిణమిస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌పై ఆధిపత్యం చెలాయించాలంటే కేవలం స్థానిక అంశాలకే పరిమితం కాకుండా, సామాజిక వర్గాలను కలుపుకొని పోవాలనే సత్యాన్ని కాంగ్రెస్ గుర్తించింది. రేవంత్ రెడ్డి ఒకవైపు అభివృద్ధి పనులు, మరోవైపు భావోద్వేగపూరితమైన రాజకీయ నిర్ణయాలతో సెటిలర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ అనేది కేవలం ఒక సంకేతం మాత్రమేనని, దీని వెనుక మరిన్ని రాజకీయ కార్యాచరణలు ఉన్నాయని స్పష్టమవుతోంది. సీమాంధ్రులను తమ వెంటే ఉంచుకోవాలని కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయనేది కాలమే నిర్ణయిస్తుంది. ఏదేమైనా, ఈ నిర్ణయం మాత్రం రాజకీయంగా భారీ చర్చకు దారితీసింది. ప్రజల నాడిని పట్టుకోవడంలో రేవంత్ చూపిస్తున్న వేగం ప్రత్యర్థులకు నిద్రలేకుండా చేస్తోంది. ఈ రాజకీయ యుద్ధంలో ఎవరి వ్యూహం ఎంతవరకు పనిచేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ పాత వాదనలు ఇప్పుడు సెటిలర్లకు విసుగు తెప్పిస్తున్నాయని కాంగ్రెస్ నమ్ముతోంది. అందుకే రేవంత్ రెడ్డి కొత్త రాజకీయ అజెండాను తెరపైకి తెచ్చారు. విగ్రహావిష్కరణతో మొదలైన ఈ ప్రక్రియ రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కేవలం ఒక వర్గానికే పరిమితం కాకుండా, అందరినీ కలుపుకొని పోయే రాజకీయాలకు నాంది పలకాలని కాంగ్రెస్ భావిస్తోంది. దీనికి సెటిలర్ల మద్దతు ఎంతవరకు ఉంటుందనేది స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలతో తేలిపోతుంది.

# సర్‌తో బీజేపీ కుట్ర




- ప్రక్రియపై పూర్తి అవగాహన పెంచుకోవాలి
- పేదలు, వలస కార్మికుల ఓట్లు తొలగకుండా చూడాలి
- నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జీలను నియమించాలి
- పార్టీ కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలి
- క్షేత్రస్థాయి సమావేశాలు క్రమం తప్పకుండా జరపాలి
- ఓటర్ల జాబితా రక్షణకు బూత్ స్థాయికి వెళ్లాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైన ఆయుధమని, దానిని కాపాడుకోవడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ఆయన పార్టీ నాయకత్వానికి, శ్రేణులకు ప్రత్యేక సవరణ అంశంపై దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో చోటుచేసుకునే చిన్న పొరపాట్లు సైతం సామాన్యుల జీవితాలపై ప్రభావం చూపుతాయని, కావున అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో సమస్యలను ముందే గుర్తించి, పేదలకు, సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే లక్ష్యంగా పార్టీ యంత్రాంగం పనిచేయాలని ఆయన కోరారు. ఓటర్ల నమోదులో ఎటువంటి అవకతవకలు జరగకుండా బూత్ స్థాయి నుంచే పటిష్టమైన నిఘా ఉంచాలని సూచించారు. ప్రత్యేక సవరణ ప్రక్రియ వల్ల లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవచ్చని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో వలసలు అధికంగా ఉండటం వల్ల ఓటర్ల జాబితా మార్పుల ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ఆయన వివరించారు. ముఖ్యంగా మహిళలు, దళితులు, మైనారిటీల ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉందని, ఆయా వర్గాల హక్కులను కాపాడటంలో పార్టీ నాయకత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఓటరు నమోదు జరగడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని, దీనిలో కాంగ్రెస్ శ్రేణులు అగ్రభాగంలో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. గతంలో బూత్ స్థాయి ఎన్రోలర్ల సహకారంతో తొంభై రోజుల్లోనే నలభై ఐదు లక్షల డిజిటల్ సభ్యత్వ నమోదును పూర్తి చేసి రికార్డు సృష్టించామని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. అదే స్థాయి పట్టుదల, సమర్థతతో ప్రత్యేక సవరణ ప్రక్రియను కూడా విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. అత్యధిక సభ్యత్వ నమోదు చేసిన నాయకులను గతంలో రాహుల్ గాంధీ స్వయంగా సత్కరించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఇప్పుడు కూడా అదే స్థాయి ఉత్సాహంతో పని చేసి, క్షేత్రస్థాయిలో పార్టీ పట్టును మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు. పార్టీ అంటే కేవలం నాయకుల వ్యవస్థ కాదని, కార్యకర్తలే ప్రాణవాయువని, వారిని ప్రోత్సహించే బాధ్యత నాయకత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మొత్తం నూట పంతొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాలు, పదిహేడు లోక్‌సభ స్థానాల్లో ప్రత్యేక బాధ్యతలను కేటాయించాలని ఆయన నిర్ణయించారు. ప్రతి నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌లను నియమించి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ తప్పనిసరిగా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, ఎవరికీ ఎటువంటి మినహాయింపు ఉండదని తేల్చి చెప్పారు. నాయకులు నిత్యం అందుబాటులో ఉంటేనే కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నిండుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమయాన్ని వెచ్చించాలని, బాధ్యతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఇన్‌చార్జ్ మంత్రులు ప్రతి పది రోజులకు ఒక రోజు పూర్తిగా పార్టీ పనులకే కేటాయించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. తాను కూడా ప్రతి పది రోజులకు ఒకసారి కార్యకర్తలతో నేరుగా సమావేశమై సమస్యలను తెలుసుకుంటానని, నెలలో మూడు రోజులు పూర్తిగా పార్టీ వ్యవహారాలకే సమయం ఇస్తానని ఆయన ప్రకటించారు. ముఖ్యమంత్రి స్థాయిలోనే తాను పార్టీ కోసం సమయాన్ని వెచ్చిస్తున్నప్పుడు, మిగిలిన నాయకులు బాధ్యతను గుర్తించాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయి కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చినా అండగా ఉంటామని, అందరం కలిసికట్టుగా పనిచేస్తేనే పార్టీ అజేయంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకునే నాయకులే నిజమైన ప్రజాసేవకులని ఆయన ఉద్ఘాటించారు. మాజీ పీసీసీ అధ్యక్షుల సలహాలు, సూచనలను గౌరవిస్తూ వారిని కలుపుకుని వెళ్లాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వారి సుదీర్ఘ రాజకీయ అనుభవం పార్టీకి ఎంతో అవసరమని, గెలుపు బాటలో వారి సలహాలు మార్గదర్శకంగా ఉంటాయని ఆయన చెప్పారు. వలసల కారణంగా ఓట్లు పోకుండా చూడటంలో మాజీ అధ్యక్షుల సూచనలు పాటించాలని, క్షేత్రస్థాయిలో సమన్వయం పెంచుకోవాలని కోరారు. నాయకులు స్వయంగా బూత్ స్థాయికి వెళితేనే కార్యకర్తలు ఉత్సాహంగా పని చేస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. పాత తరం అనుభవం, కొత్త తరం ఉత్సాహం కలిస్తేనే పార్టీ తిరుగులేని శక్తిగా ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో సమన్వయమే గెలుపునకు మూలమని ఆయన గుర్తుచేశారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలోని పదిహేను నియోజకవర్గాల్లో ప్రత్యేక బాధ్యతలను అప్పగించాలని ఆయన సూచించారు. నగరంలోని నియోజకవర్గాల్లో ప్రత్యేక సవరణపై అసెంబ్లీ స్థాయి సమావేశాలు వెంటనే నిర్వహించాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరం రాజకీయంగా అత్యంత కీలకమని, ఇక్కడ పార్టీ సంస్థాగత బలం పెరగాలని ఆయన పేర్కొన్నారు. నగరంలోని సామాజిక వర్గాలను కలుపుకుని వెళ్లడం ద్వారానే మెజారిటీ ఓట్లు సాధించగలమని ఆయన వివరించారు. అర్బన్ ఓటర్లలో పార్టీపై నమ్మకాన్ని పెంచేలా కార్యక్రమాలు రూపొందించాలని, ప్రతి గల్లీలోనూ పార్టీ ఉనికి చాటాలని ఆయన కోరారు. నగరంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే ధ్యేయంగా నాయకులు పనిచేయాలని స్పష్టం చేశారు. మహిళా కాంగ్రెస్ క్లస్టర్ స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహిళల ఓట్లు పార్టీకి కీలమని, క్షేత్రస్థాయిలో వారిని భాగస్వామ్యం చేయడం వల్ల పార్టీ మరింత బలపడుతుందని ఆయన చెప్పారు. గృహిణులు, మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా పార్టీ విధానాలు ఉండాలని, వారి గళాన్ని బలంగా వినిపించాలని కోరారు. ప్రజా సమస్యలపై మహిళా నాయకత్వం చురుకుగా స్పందించి, ప్రభుత్వ కార్యక్రమాలను ఇంటింటికి చేరవేయాలని సూచించారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, మహిళా ఓటర్ల మద్దతు కూడగట్టడంలో మహిళా కాంగ్రెస్ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడం, ఓటర్ల జాబితాను రక్షించడం, క్షేత్రస్థాయిలో సమన్వయం సాధించడంపై ముఖ్యమంత్రి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అధికారంలో ఉన్నాం కదా అని కార్యకర్తలు అజాగ్రత్తగా ఉండకూడదని, పార్టీ బలం పెంచుకుంటూనే ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి ఓటును కాపాడుకోవడం ద్వారానే వచ్చే ఎన్నికల్లో పార్టీని తిరుగులేని శక్తిగా మార్చాలని ఆయన ఆకాంక్షించారు. పార్టీ అగ్ర నాయకత్వం నుంచి బూత్ స్థాయి కార్యకర్త వరకు అందరూ ఐక్యంగా పనిచేస్తేనే లక్ష్యాలను చేరుకోగలమని ఆయన స్పష్టం చేశారు. నిరంతర నిఘా, సమన్వయం, కార్యకర్తల సంక్షేమంపై దృష్టి సారిస్తే గెలుపు సులువు అవుతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశం ద్వారా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపిన ముఖ్యమంత్రి, నిరంతరం ప్రజల్లో ఉండాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారుల వద్దకు చేర్చడం ద్వారా పార్టీ ఇమేజ్ పెంచాలని కోరారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొడుతూ ప్రజలకు వాస్తవాలను వివరించాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రజల్లో గట్టి నమ్మకం కలిగించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యకర్తలందరూ ఒకే లక్ష్యంతో, ఐక్యంగా పనిచేసి ప్రజాస్వామ్యాన్ని, పార్టీ గౌరవాన్ని కాపాడాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ దిశానిర్దేశం పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ, రాబోయే సవాళ్లను ఎదుర్కొనేలా శ్రేణులను సిద్ధం చేసింది.

# అంకిత భావంతో చేసిన పని మరువలేనివి ..!

**అటెండర్ ధర్మయ్య పదవి విరమణ సభలో అదనపు కలెక్టర్, జెడ్పి సీఈవో, డీ పురుషోత్తం**



**మరిపెడ విశాలభారతి:** ప్రభుత్వ కార్యాలయంలో అటెండర్ గా అంకితభావంతో పనిచేసిన బల్లెం ధర్మయ్య సేవలు మరవలేనివి అని జెడ్పి సీఈవో, జిల్లా అదనపు కలెక్టర్ డీ పురుషోత్తం అన్నారు. శుక్రవారం మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక భార్గవి ఫంక్షన్ హాల్ లో ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అటెండర్ బల్లెం ధర్మయ్య పదవి విరమణ, అభినందన సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన పురుషోత్తం మాట్లాడుతూ జిల్లాలోని అతిపెద్ద మండలం అయిన మరిపెడలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంతో ఓపికతో 38 సంవత్సరాలు తన జీవితాన్ని ప్రభుత్వ కార్యాలయంలో సేవలందించినందుకు ఆయనకు వారి కుటుంబ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. అనేక స్థానిక సంస్థలు జనరల్ ఎన్నికలు జరిగినప్పుడు ధర్మయ్య సేవలు ఎంతో ఉపయోగపడేవని అధికారులు గుర్తుచేసుకున్నారు. ఆఫీస్ అటెండర్ గా ఉంటూ ఎంతోమంది అధికారులకు మార్గదర్శకంగా నిలిచారని వచ్చిన వారందరినీ ఎలా పనిచేయాలని తన అనుభవం ద్వారా నేర్పించేవారని పేర్కొన్నారు. అలాంటివారు నేడు పదవి విరమణ పొందడం బాధాకరమైనప్పటికీ, విధి నిర్వహణలో ఆయన కర్తవ్యం ముగిసింది కాబట్టి ఖచ్చితంగా ఆయనకు వీడ్కోలు చెప్పక తప్పదన్నారు. ధర్మయ్యా లాంటి వారిని సేవలను స్ఫూర్తిగా తీసుకొని నేడు పనిచేస్తున్న అటెండర్లు ఆదర్శంగా సేవలందించాలని ఆఫీసు కార్యాలయం సిబ్బంది పనిచేయాలని సూచించారు. ధర్మయ్య ఆయుర్ ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. అనంతరం ధర్మయ్య భార్య భర్తల ఇద్దరికి ప్రశంసల పత్రం అందించి శాలువలతో ఘనంగా సత్కరించి వారికి అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి వేణుగోపాల్ రెడ్డి, ఎంపీ ఓ సోమ్లా నాయక్, ఎంఈఓ జి అనిత దేవి, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఇమామ్ సాబ్, జూనియర్ అసిస్టెంట్ రమేష్‌బాబు, సూపరెంట్ యాకూబ్, నూతన, పాత, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, బంధుమిత్రులు తదితరులు ఉన్నారు.

# సవాల్‌ను స్వీకరించే దమ్ముందా లేదా కేటీఆర్?

- చర్చకు సిద్ధమా అని కేటీఆర్‌ను మంత్రి నిలదీశారు
- బీఆర్ఎస్ కంటే ఎక్కువ ఇళ్లు కట్టామని పొంగులేటి క్లెయిమ్
- కాంగ్రెస్ ఎక్కువ కడితే పోటీకి దూరంగా ఉంటారా అని ప్రశ్న
- ఒక్కో డబుల్ బెడ్‌రూం ఏడు ఇందిరమ్మ ఇళ్లకు సమానమని కేటీఆర్ వాదన
- మేనిఫెస్టోను అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని కేటీఆర్ డిమాండ్
- అవినీతి, అక్రమాలపై పరస్పర ఆరోపణలు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అంశం తీవ్రస్థాయి చర్చకు దారితీసింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ పథకంపై కేటీఆర్ చేసిన విమర్శలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి పొంగులేటి, ఇందిరమ్మ ఇళ్లే రిఫరెండమని స్పష్టం చేశారు. సవాల్ స్వీకరించే ధైర్యం ఉందా అంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఆయన ఉద్ఘాటించారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, చేతల్లో చూపిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల గురించి మాట్లాడే ధైర్యం లేకనే కేటీఆర్ హైదరాబాద్‌పై దృష్టి మళ్లించారని పొంగులేటి మండిపడ్డారు. నగరంలో ఇళ్ల నిర్మాణంపై సవాల్ విసిరి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చేతల ప్రభుత్వంగా వ్యవహరిస్తున్న తాము, కేవలం రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే గ్రామాల్లో ఏకంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించామని గణాంకాలతో సహా వెల్లడించారు. జూన్ ఒకటో తేదీన మరో రెండు లక్షల యాభై వేల ఇళ్ల నిర్మాణ పనులను మొదలుపెట్టబోతున్నామని ప్రకటించారు. హైదరాబాద్ పరిధిలో తొలి విడతలోనే లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించబోతున్నామని ఆయన స్పష్టం చేశారు.

అవినీతి కేసుల నుండి బయటపడేందుకు బీఆర్ఎస్ నేతలు ఢిల్లీలో బీజేపీ పెద్దల ముందు మోకరిల్లారని మంత్రి పొంగులేటి తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు, బీజేపీ ఎంపీ సీఎం రమేష్, కవిత సైతం ఈ విషయాన్ని ప్రస్తావించారని గుర్తు చేశారు. దళితులను ముఖ్యమంత్రి చేస్తామన్న హామీ నుండి డబుల్ బెడ్రూం ఇళ్ల వరకు ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌ను ఉద్దేశించి డ్రామారావు అని సంబోధిస్తూ, మాటలు తప్ప చేతలు ఎక్కడైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఆయన అవినీతి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో ధరణి దందాలు, బినామీల బాగోతాలు, రియల్ ఎస్టేట్ అక్రమాలు యథేచ్ఛగా జరిగాయని పొంగులేటి విమర్శించారు. గత పాలనలో జరిగిన అక్రమాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తుంటే, బీఆర్ఎస్ నేతలు మాత్రం స్వార్థంతో దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. 2014కు ముందు బీఆర్ఎస్ ఆర్థిక పరిస్థితి ఏమిటో, పదేళ్ల అధికారం తర్వాత ఎలా మారిందో ప్రజలకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్న సమయంలో విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దోచుకున్న వారు, ఇతరులపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని ఆయన ఎత్తిచూపారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కట్టిన ఇళ్ల కంటే, కేవలం రెండున్నర ఏళ్లలోనే కాంగ్రెస్ మూడురెట్లు ఎక్కువ ఇళ్లు నిర్మించిందని మంత్రి పొంగులేటి తేల్చి చెప్పారు. హైదరాబాద్‌లో ఇళ్ల నిర్మాణంపై మరోసారి సవాల్ విసురుతున్నానని ఆయన ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఇళ్ల సంఖ్య, బీఆర్ఎస్ పదేళ్లలో నిర్మించిన వాటి కంటే ఎక్కువ అని నిరూపితమైతే కేటీఆర్ పోటీకి దూరంగా ఉంటారా అని సవాల్ విసిరారు. దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. తప్పుడు ఆరోపణలు చేయడం మానేసి, నిర్మాణాత్మకమైన చర్చకు సిద్ధపడాలని ఆయన కేటీఆర్‌కు సూచించారు. మరోవైపు, కాంగ్రెస్ ప్రభుత్వం ఇరవై లక్షల ఇళ్లు కట్టిస్తేనే ఓట్లు అడగాలని కేటీఆర్ సవాల్ విసిరారు. గతంలో ఇరవై లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేసిన మంత్రి, ఆ మాటను నిలబెట్టుకునే దమ్ముందా అని నిలదీశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తాము కట్టిన ఒక్కో డబుల్ బెడ్రూం ఇల్లు, ఏడు ఇందిరమ్మ ఇళ్లతో సమానమని ఆయన వ్యాఖ్యానించారు. అంతకు మించి హైదరాబాద్‌లో ఇళ్లను నిర్మించగల సత్తా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అంకితభావంతో డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి ఇచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మాటల గారడీ చేయడం మానుకుని, ప్రజల కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన హితవు పలికారు. కేవలం అబద్ధపు ప్రచారాలతో కాలక్షేపం చేయడం సరికాదని, ఇచ్చిన మాట కోసం నిలబడాలని ఆయన వ్యాఖ్యానించారు. తాము చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకే కాంగ్రెస్ నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తమ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఇరు పార్టీల నేతల మధ్య సాగుతున్న ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లు రాష్ట్రంలో రాజకీయ వేడిని పెంచాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అనేది కేవలం ఒక పథకం మాత్రమే కాదు, ఇది ఒక రాజకీయ ఎజెండాగా మారింది. ఒకవైపు ప్రభుత్వ పక్షం తాము చేపట్టిన పనులను గణాంకాలతో సహా వివరిస్తూ దూకుడు పెంచుతుండగా, మరోవైపు ప్రతిపక్షం ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును ప్రశ్నిస్తూ ఒత్తిడి పెంచుతోంది. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణం ఏ మేరకు సాగుతుందనేది ప్రజలందరిలో ఆసక్తికరమైన అంశంగా మారింది. క్షేత్రస్థాయిలో వాస్తవాలు ఏంటనేది త్వరలోనే వెల్లడికానున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గృహనిర్మాణ రంగంలో వస్తున్న ఈ మార్పులు, ప్రజల జీవన ప్రమాణాలను ఏ మేరకు మెరుగుపరుస్తాయనేది వేచి చూడాలి. ముఖ్యంగా నిరుపేదలకు సొంత ఇళ్లు కల్పించడం అనేది అతిపెద్ద సవాలుగా ఉన్న తరుణంలో, ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యూహాలు ఎంతవరకు సఫలీకృతం అవుతాయనేది కీలక అంశం. రాజకీయ నేతలు సవాళ్లు విసురుకోవడం పరిపాటి అయినప్పటికీ, ఆ సవాళ్లు ప్రజా సంక్షేమం చుట్టూ తిరగడం శుభపరిణామం. ఏది ఏమైనా, రాబోయే రోజుల్లో ఇళ్ల నిర్మాణ పురోగతిపైనే రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని స్పష్టమవుతోంది. ప్రజలకు నాణ్యమైన ఇళ్లను అందించడమే అసలైన విజయం అని మేధావులు అభిప్రాయపడుతున్నారు. చివరికి ఏ ప్రభుత్వం ఎక్కువ ఇళ్లను నిర్మించిందనే దానికంటే, ఎంతమంది అర్హులైన పేదలకు సొంతిల్లు దక్కిందనేదే ముఖ్యం. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కేటీఆర్ మధ్య సాగుతున్న ఈ వాదోపవాదాలు, ఇళ్ల నిర్మాణ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తున్నాయి. రాజకీయ ప్రత్యర్థుల మధ్య పోటీ ప్రజాహితంగా ఉన్నంత వరకు అభ్యంతరం లేదని సాధారణ ప్రజలు భావిస్తున్నారు. కేవలం గణాంకాలతో రాజకీయ పబ్బం గడుపుకోవడం కాకుండా, నిజంగా పేదవాడి కన్నీరు తుడిచేలా ప్రభుత్వాలు అడుగులు వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ సవాళ్ల పర్వం ఎటు దారితీస్తుందో చూడాలి.

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గంప శ్రీనివాస్ నియామకం



**విశాలభారతి, సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు గంప శ్రీనివాస్ నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని చింతల్ బస్తీ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తణుకు ఆంజనేయులు, మాజీ అధ్యక్షుడు అయిత రత్నాకర్, మంచాల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సముద్రాల హరినాథ్, కోశాధికారి డా. మంకాల నవీన్ కుమార్, మాజీ ప్రధాన కార్యదర్శి తడక లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**సేవలను గుర్తించి బాధ్యత**

ఈ సందర్భంగా అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి గంప శ్రీనివాస్ అందిస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని అప్పగించినట్లు తెలిపారు. సమాజ సంక్షేమ కార్యక్రమాల్లో ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

**వైశ్యుల అభివృద్ధికి కృషి**

నియామకంపై స్పందించిన గంప శ్రీనివాస్, తనపై విశ్వాసం ఉంచి బాధ్యత అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద ఆర్యవైశ్య విద్యార్థుల ఉన్నత విద్యకు, స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. రాజకీయ రంగంలో వైశ్యుల ప్రాతినిధ్యం పెరగడానికి కృషి చేస్తానని చెప్పారు.

**పలు హోదాల్లో సేవలు**

గంప శ్రీనివాస్ ప్రస్తుతం పలు సామాజిక, ఆధ్యాత్మిక, వృత్తిపర సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు, వైశ్య సంక్షేమ సమితి ఉపాధ్యక్షుడు, డిస్ట్రిక్ట్ లేయర్ పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అలాగే యాదగిరిగుట్ట ఆర్యవైశ్య సత్రం సహాయ కార్యదర్శి, కొమురవెల్లి ఆర్యవైశ్య సత్రం ముఖ్య సలహాదారుగా సేవలందిస్తున్నారు. సిద్దిపేట పాత వెంకటేశ్వర స్వామి దేవాలయం, బంగారు మైసమ్మ దేవాలయాల గౌరవ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

**జిల్లా నాయకుల హర్షం**

గంప శ్రీనివాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులవడంపై సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఆర్యవైశ్య నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు తణుకు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సముద్రాల హరినాథ్, కోశాధికారి డా. మంకాల నవీన్ కుమార్, యాసాల వెంకట్ లింగం, కాసం నవీన్ కుమార్, మంకాల నాగరాణి, మాడిశెట్టి హేమలత, తడక లింగమూర్తి, మంచాల శ్రీనివాస్, మంకాల నగేష్, పబ్బ మాధవి, రవికంటి చంద్రశేఖర్, గంప కృష్ణమూర్తి, చింత రాజేంద్రప్రసాద్, పుల్లూరి శివకుమార్, అర్వపల్లి హరికిరణ్, అయిత పురుషోత్తం, సోమ శివకుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

## గద్దెనెక్కాక గద్దలా మారిన రేవంత్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా తయారైందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస నియంత్రణ లేదని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం దోపిడి రాజ్యం కొనసాగుతోందని ఘాటైన విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తున్న తరుణంలో, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చోద్యం చూస్తోందని ఆయన సూటిగా నిలదీశారు. అన్నదాతలు పడుతున్న కష్టాలను స్వయంగా తెలుసుకునే లక్ష్యంతో చేపట్టిన 'రైతు గోస బీజేపీ భరోసా' యాత్రలో వాస్తవ పరిస్థితులను కళ్లకు కట్టినట్లు కనిపించాయని ఆయన వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు రోజుల పాటు పర్యటించినప్పుడు, క్షేత్రస్థాయిలో రైతాంగం ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులు తనను కలచివేశాయని మహేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లు ఎనభై శాతం పూర్తయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా చేసిన ప్రకటన పచ్చి అబద్ధమని ఆయన కొట్టిపారేశారు. క్షేత్రస్థాయిలో ఇంకా ఎనభై శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దనే కుప్పలుగా పేరుకుపోయి ఉన్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. బీజేపీ క్షేత్రస్థాయిలో పోరాటాన్ని ఉధృతం చేసిన తర్వాతే ప్రభుత్వం హడావుడిగా సమీక్షలు నిర్వహించడం, మంత్రులు కల్లాల బాట పట్టడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఇసుక, సిమెంట్ లారీల రాకపోకలకు ప్రాధాన్యత ఇచ్చినంతగా, ధాన్యం సేకరణపై ప్రభుత్వం దృష్టి సారించలేదని ఆయన విమర్శించారు. కనీసం రైతులకు గన్నీ బ్యాగులు అందజేయలేని దుస్థితిలో ఈ పాలన ఉందని, లారీలు, హమాలీల ఖర్చులను కూడా రైతుల నెత్తినే రుద్దుతున్నారని ఆయన ఆరోపించారు. తమ శ్రమను దోచుకుంటూ, చివరి గింజ వరకు కొంటామన్న హామీని గాలికి వదిలేశారని ఆయన మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసీఆర్ సర్కార్‌ను ధాన్యం కొనుగోలుపై ఉతికి ఆరేసిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారం చేతికి రాగానే రేవంత్ రెడ్డి గద్దలా మారిపోయారని, రైతు సమస్యలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాడుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సరఫరా చేస్తున్న యూరియాను కూడా రైతులకు సకాలంలో అందించకుండా, క్లిష్టమైన యాప్ విధానంతో వేధిస్తున్నారని ఆయన విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వయసురీత్యా పరిణతి కోల్పోయి, బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి, పదవుల కోసం, సూట్‌కేసులతో ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ధాన్యం సేకరణలో నెలకొన్న లోపాలపై బహిరంగ చర్చకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఈ చర్చకు రావాలని ఆయన బహిరంగంగా కోరారు. బీజేపీ చేపట్టిన ప్రజా పోరాటాన్ని చూసి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఇంతగా భయపడుతోందో అర్థం కావడం లేదని ఆయన విశ్లేషించారు. ప్రతిపక్షం ప్రశ్నిస్తుంటే ఉలిక్కిపడటం సహజమని, కానీ ప్రభుత్వం ప్రజల పట్ల కనీస బాధ్యతతో వ్యవహరించాలని ఆయన హితవు పలికారు. ఇటువంటి నిరంకుశ పోకడలను చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పెట్రోల్, డీజిల్ ధరలపై ఏమాత్రం అవగాహన లేదని ఆయన విమర్శించారు. నిత్యావసరాలు, ఇంధన ధరల నియంత్రణలో వైఫల్యం చెందారని, ముప్పై శాతం వ్యాట్‌ను తగ్గించి సామాన్యులకు ఉపశమనం ఎందుకు కలిగించడం లేదని ఆయన రేవంత్ రెడ్డిని నిలదీశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎండల తీవ్రతకు, వడదెబ్బకు గురై రైతులు ప్రాణాలు కోల్పోతుంటే, ఏ ఒక్క మంత్రి కూడా వారిని పరామర్శించలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మరణించిన రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించకపోవడం ప్రభుత్వ అమానవీయతకు నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. సన్‌ఫ్లవర్, శనగలు కొనుగోలు చేస్తున్నామని మంత్రులు గొప్పలు చెప్పుకుంటున్నారని, ఆ కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో, ఎన్ని క్వింటాళ్లు కొన్నారో నిరూపించాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితమై, గాలిలో మేడలు కడుతున్నారని ఆయన విమర్శించారు. రైతుల ఆవేదనను పట్టించుకోని పాలకులకు గద్దెపై ఉండే అర్హత లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భవిష్యత్తులో బీజేపీ ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తుందని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో గందరగోళ పరిస్థితి నెలకొందని, పరిపాలన యంత్రాంగం పూర్తిగా నిర్వీర్యమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులను కూడా సొంత పనులకు వాడుకుంటూ, ప్రజాసేవను విస్మరించారని ఆయన ఆరోపించారు. ఇటువంటి బాధ్యతారాహిత్యమైన పరిపాలన వల్ల తెలంగాణ ఆర్థికంగా దెబ్బతింటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంకెలు, లెక్కలు అబద్ధాలు చెబితే సరిపోదని, క్షేత్రస్థాయిలో వాస్తవాలు భిన్నంగా ఉన్నాయని ఆయన పునరుద్ఘాటించారు. రైతును రాజును చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, చివరికి రైతును రోడ్డున పడేసిందని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారంతో వ్యవహరిస్తున్నారని, ప్రజాప్రతినిధుల సూచనలను కూడా బేఖాతరు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రతిపక్షాలను గౌరవించడం నేర్చుకోవాలని, ప్రజా సమస్యలపై చర్చించే సంస్కృతిని అలవర్చుకోవాలని ఆయన హితవు పలికారు. ధాన్యం కొనుగోళ్లపై చేస్తున్న ఆరోపణలను ప్రభుత్వం తప్పుగా భావిస్తే, వాస్తవాలను బయటపెట్టాలని ఆయన సవాల్ విసిరారు. బీజేపీ బలం పెరుగుతుందన్న భయంతోనే ప్రభుత్వం ఆందోళన చెందుతోందని, ప్రజల పక్షాన తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో బీజేపీ వెనకడుగు వేయదని మహేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రైతు సమస్యలు పరిష్కారం అయ్యే వరకు, ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిగా ముగిసే వరకు తమ పోరాట యాత్రలు కొనసాగుతాయని ఆయన ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించి, తక్షణమే ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పట్ల స్పందించని పక్షంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.



## రైతును చీకట్లోకి నెట్టే ప్రయత్నమే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో విద్యుత్ సరఫరా అంశం మరోమారు తీవ్ర చర్చకు దారితీస్తోంది. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. రాష్ట్రంలోని రైతాంగ ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా గతంలో మాదిరిగా నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించడంలో ప్రస్తుత పాలకులు విముఖత చూపుతున్నారనే భావన ప్రతిపక్ష నాయకుల వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. రైతులకు మూడు గంటల విద్యుత్ సరిపోతుందంటూ జరిగిన ప్రచారం ఇప్పుడు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆయన ఆరోపణలు గుప్పిస్తున్నారు. విద్యుత్ నియంత్రణ మండలి సమావేశంలో జరిగిన పరిణామాలు ఇప్పుడు రైతాంగంలో ఆందోళన కలిగిస్తున్నాయి. రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనా దృక్పథాన్ని ప్రతిబింబిస్తున్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు. సుదీర్ఘకాలం శ్రమించి సాధించుకున్న 24 గంటల ఉచిత విద్యుత్ వ్యవస్థకు తూట్లు పొడిచే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం మూడు గంటల కరెంట్ చాలు అనడం వెనుక లోతైన కుట్ర దాగి ఉందని ప్రతిపక్షం వాదిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్య మాత్రమే కాదని, దీని వెనుక ప్రభుత్వ పెద్దల అభీష్టం ఉందని హరీశ్ రావు తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రగతిని వెనక్కి నెట్టే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. వ్యవసాయరంగంపై కనీస అవగాహన లేని వ్యక్తులు పాలనలో ఉండటం వల్లే ఇటువంటి అనాలోచిత వ్యాఖ్యలు వస్తున్నాయని హరీశ్ రావు విమర్శించారు. పొలం వద్దకు వెళ్లి బోర్ల దగ్గర పడిగాపులు కాసే రైతుల కష్టం ఎవరికీ అర్థం కావడం లేదని ఆయన ఆవేదన చెందారు. గత దశాబ్ద కాలంలో తెలంగాణ వ్యవసాయం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, అటువంటి రంగాన్ని మళ్లీ అంధకారంలోకి నెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన హెచ్చరించారు. మూడు గంటల విద్యుత్ ఇస్తే పంటలు ఎలా సాగు అవుతాయో, మోటార్లు కాలిపోతే రైతుల పరిస్థితి ఏమవుతుందో ఎవరూ ఆలోచించడం లేదని ఆయన ప్రశ్నించారు. రైతులను తిరిగి కష్టాల కడలిలోకి పంపే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపణలు చేశారు. అమెరికా పర్యటనలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు ఇప్పుడు అమలు రూపం వస్తోందని హరీశ్ రావు తనదైన శైలిలో విశ్లేషించారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 27 లక్షలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఎలాంటి ఆటంకం లేకుండా నాణ్యమైన కరెంటును అందించింది. అప్పటి ప్రభుత్వం తీసుకున్న సమర్థవంతమైన నిర్ణయాల వల్లనే రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 60 లక్షల ఎకరాల నుండి కోటిన్నర ఎకరాలకు పైగా పెరిగింది. కానీ ఇప్పుడు సరైన విద్యుత్ అందక రైతులు అష్టకష్టాలు పడుతున్నారని హరీశ్ రావు గణాంకాలతో సహా వివరిస్తున్నారు. విద్యుత్ కోతల వల్ల పంటలు ఎండిపోయి అప్పుల పాలవుతున్న రైతుల గురించి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన నిలదీశారు. రైతు డిస్కం పేరుతో ప్రభుత్వం సరికొత్త నాటకానికి తెర లేపిందని హరీశ్ రావు అభివర్ణించారు. ఈ డిస్కం ఏర్పాటు వెనుక రైతుల కోసం కాకుండా, ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చాలనే ఉద్దేశ్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాల్సిన బాధ్యతను పక్కన పెట్టి, రైతుకు కరెంట్ ఎందుకు అనే ధోరణిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తిస్తోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన పాలకులు, ఇప్పుడు వాస్తవ పరిస్థితులను మరుగున పరిచేందుకు ప్రయత్నిస్తున్నారు. డిస్కం ఏర్పాటు ప్రక్రియ పారదర్శకంగా లేదని, ఇందులో ఏదో మతలబు ఉందని ఆయన విమర్శించారు. రైతుల కష్టార్జితాన్ని నాశనం చేసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. ఎరువుల సరఫరాలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్ రావు పేర్కొన్నారు. సీజన్ మొదలైనప్పటి నుండి ఎరువుల కోసం రైతులు రోడ్లెక్కి ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి చూసినా ఎరువులు దొరకక, బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యవసాయానికి కావాల్సిన మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందనడానికి ఇది ఒక నిదర్శనం. పంట కొనుగోళ్లలో కూడా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తేమ పేరుతో, గింజ రంగు మారిందనే కారణాలతో కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి క్వింటాలుకు ఎనిమిది నుండి పది కిలోల వరకు కోత విధిస్తున్నారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతుల ఆత్మహత్యలు పెరిగే ప్రమాదం ఉందని హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. పంటలకు మద్దతు ధర లేక, సాగుకు విద్యుత్ అందక రైతులు తీవ్ర దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నిరంతర విద్యుత్ ఉంటేనే రైతు ధీమాగా ఉంటాడని, దాన్ని కట్ చేస్తే రైతుల ప్రాణాలను బలితీసుకున్నట్టే అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ శాఖలో వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టి మౌలిక వసతులను బలోపేతం చేసింది. నేడు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేయడం ద్వారా రైతుల వెన్ను విరిచే కుట్ర జరుగుతోంది. వ్యవసాయ రంగం కుదేలైతే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందనే కనీస జ్ఞానం పాలకులకు లేదా అని ఆయన ప్రశ్నించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాల్సిన ప్రభుత్వం, ఇప్పుడు రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోంది. మూడు గంటల కరెంట్ చాలు అనడం అంటే రైతుల గొంతు కోయడమేనని హరీశ్ రావు ఆరోపించారు. విద్యుత్ నియంత్రణ మండలిలో జరిగిన చర్చలు రైతుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించాయి. కేవలం రాజకీయాల కోసమే రైతు ప్రాణాలతో ఆడుకోవడం మంచిది కాదని ఆయన హితవు పలికారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకుంటోంది. అభివృద్ధిని పక్కన పెట్టి, గతంలో అమలులో ఉన్న సంక్షేమ పథకాలను నీరుగార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు.



## అంగట్లో 'డబుల్ బెడ్‌రూం'లు

**మొదటిపేజీ తరువాయి**

సామాజిక మాధ్యమాల వేదికగా ఫ్లాట్ల అమ్మకాలు జోరుగా జరుగుతుండటం గమనార్హం. బ్లాక్ నంబర్, ఫ్లాట్ నంబర్ వంటి వివరాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, కొనుగోలుదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. రూ. 6 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు ధర నిర్ణయించి, నోటరీ పత్రాల ద్వారా ఒప్పందాలు చేసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ లేని ఈ అమ్మకాలు భవిష్యత్తులో కొనుగోలుదారులకు పెద్ద చిక్కులు తెచ్చిపెడతాయని తెలిసినా, తక్కువ ధరకే వస్తున్నాయన్న ఆశతో ఎందరో మోసపోతున్నారు. పేదరికంలో ఉన్న లబ్ధిదారులను ఆర్థికంగా ప్రలోభపెట్టడం ద్వారా, బ్రోకర్లు కమీషన్ల రూపంలో భారీగా లాభపడుతున్నారు. నిబంధనలను పక్కన పెట్టి సాగుతున్న ఈ దందా, ప్రభుత్వ పథకం ఉద్దేశ్యాన్నే నీరుగారుస్తోంది. ఈ అక్రమ కార్యకలాపాల్లో కొల్లూరు ఫేజ్ 2 బ్లాకులకు అడ్మిన్లుగా వ్యవహరిస్తున్న వ్యక్తుల పాత్ర కీలకమని స్థానికులు ఆరోపిస్తున్నారు. లబ్ధిదారుల కుటుంబాల్లో తలెత్తిన ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు, పెళ్లిళ్లు వంటి అత్యవసర సమయాలను వీరు అవకాశంగా మార్చుకుంటున్నారు. స్థానిక రాజకీయ నాయకుల అనుచరులమని చెప్పుకుంటూ, లబ్ధిదారులను భయాందోళనకు గురిచేయడం లేదా ప్రలోభపెట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా 46, 57, 63, 66 బ్లాకులలో ఇటువంటి లావాదేవీలు ఎక్కువగా జరుగుతున్నాయని సమాచారం. మొత్తం ప్రాజెక్టులోని 50 నుంచి 70 బ్లాకులలో అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోంది. బ్రోకర్ల కనుసన్నల్లో సాగుతున్న ఈ వ్యవహారం వెనుక భారీ ముఠా హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం ఈ అక్రమాలకు ఆజ్యం పోస్తోంది. జీహెచ్ఎంసీ, ఇతర సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు కేటాయించిన ఫ్లాట్లలో లబ్ధిదారులే నివసిస్తున్నారో లేదో క్రమం తప్పకుండా తనిఖీ చేయాల్సి ఉంది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. తనిఖీల సమాచారం ముందే లబ్ధిదారులకు చేరవేయబడుతోంది. అధికారులు వచ్చే రోజున మాత్రమే లబ్ధిదారులు తమ ఇళ్లలో ప్రత్యక్షమై, ఆ తర్వాత తిరిగి సొంత ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. ఈ తంతు వల్ల అధికారులు తనిఖీల్లో ఏమీ లేదని భావిస్తూ క్లీన్ చిట్ ఇస్తున్నారు. అధికారుల ఉదాసీనత వల్ల అక్రమార్కులకు కొమ్ము కాసినట్లు అవుతోంది. ఈ లోపాలను సరిదిద్దకుంటే, భవిష్యత్తులో ఇళ్లన్నీ బడా బాబుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. ప్రభుత్వం అత్యంత ఖర్చుతో నిర్మించిన ఈ నివాసాలు నిజమైన పేదల కన్నీళ్లను తుడవాలి. అయితే కొందరి స్వార్థం వల్ల ఈ ఇళ్లు దళారుల చేతిలో వ్యాపార వస్తువులుగా మారాయి. లబ్ధిదారులు తాము నివసించలేమని భావిస్తే, ఆ విషయాన్ని అధికార యంత్రాంగానికి తెలియజేయాలి తప్ప, దళారులకు అప్పగించకూడదు. ఈ విషయంలో ప్రభుత్వం చట్టపరమైన చర్యలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉంది. అమ్మకాలు జరిగిన ఫ్లాట్లను గుర్తించి, వాటిని వెంటనే స్వాధీనం చేసుకోవాలి. నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. పారదర్శకత లేని లావాదేవీలను అడ్డుకుంటేనే డబుల్ బెడ్‌రూం పథకానికి సరైన గుర్తింపు లభిస్తుంది. క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారణ జరిపేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ఫ్లాట్లు పొందిన వారి ఆధార్ కార్డులు, ఇతర ధ్రువీకరణ పత్రాలను సరిచూస్తూ, అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించడం పెద్ద కష్టమేమీ కాదు. గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలు సమన్వయంతో పనిచేస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. పథకం ప్రయోజనం పూర్తిగా అర్హులైన పేదలకే అందాలన్నది అందరి ఆకాంక్ష. అధికారులు ఇప్పటికైనా మేల్కొని, ఇటువంటి అక్రమ దందాలను అడ్డుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే, కొల్లూరు ప్రాజెక్టు అక్రమ నివాసాలకు చిరునామాగా మిగిలిపోయే అవకాశం ఉంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రభుత్వం చేపట్టే ఇతర పథకాలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుంది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ నివాసాలు సమాజంలోని అత్యంత నిరుపేదల కోసమే నిర్మించబడ్డాయి. అందువల్ల, ఇక్కడ నివసించే వారి వివరాలను క్రమబద్ధీకరించడానికి డిజిటల్ పద్ధతులను ఉపయోగించాలి. ప్రతి ఫ్లాట్ వద్ద బయోమెట్రిక్ హాజరు లేదా ఇతర గుర్తింపు పద్ధతులను ప్రవేశపెట్టడం ద్వారా, నిజమైన లబ్ధిదారులు మాత్రమే నివసిస్తున్నట్లు నిర్ధారించుకోవచ్చు. దళారుల నెట్‌వర్క్‌ను ఛేదించడమే కాకుండా, లబ్ధిదారులకు కూడా ఈ ఇళ్ల ప్రాధాన్యతను, చట్టపరమైన చిక్కులను వివరిస్తూ అవగాహన కల్పించాలి. ప్రభుత్వం తీసుకునే కఠిన నిర్ణయాలు, ఇటువంటి అక్రమాలకు భవిష్యత్తులో ఫుల్‌స్టాప్ పెట్టగలవు. రామచంద్రాపురం, పటాన్‌చెరు పరిసరాల్లో ఇప్పటికే భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ క్రమంలోనే కొల్లూరు ప్రాజెక్టులోని ఇళ్లకు భారీ డిమాండ్ పెరిగింది. కొందరు వ్యక్తులు ఈ ఫ్లాట్లను అద్దెకు ఇవ్వడం ద్వారా కూడా నెలకు కొన్ని వేల రూపాయల ఆదాయం పొందుతున్నారు. వాస్తవానికి అద్దెకు ఇవ్వడం కూడా నిబంధనలకు విరుద్ధమే. కేటాయించిన వారే నివసించాలన్న నిబంధన ఉన్నప్పటికీ, బ్రోకర్ల ప్రోత్సాహంతో అది ఎక్కడా అమలు కావడం లేదు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఆసరాగా నిలవాల్సిన ఈ గృహాలు, అక్రమార్కులకు రాబడి మార్గంగా మారడం దురదృష్టకరం. అధికారులు సకాలంలో జోక్యం చేసుకుని, అక్రమ అద్దెదారులను ఖాళీ చేయించి, నిజమైన పేదలకు ఆ అవకాశాన్ని కల్పించాలి. డబుల్ బెడ్‌రూం పథకం లక్ష్యం దెబ్బతినకుండా ఉండేందుకు ఇప్పుడు క్షేత్రస్థాయిలో కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. అక్రమంగా విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టరీత్యా నేరమని ప్రచారం చేయాలి. ఇప్పటికే అమ్మకాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్న 50 నుంచి 70 బ్లాకులలో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలి. అక్రమ దందాకు పాల్పడుతున్న బ్రోకర్లను, అడ్మిన్లను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అప్పుడే నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుంది. లేనిపక్షంలో ఈ ప్రాజెక్టు లక్ష్యం పూర్తిగా నీరుగారిపోతుంది. ప్రజలు ఆశతో ఉన్న ఈ పథకాన్ని కాపాడుకోవడం అధికారుల బాధ్యత. ప్రభుత్వం స్పందించి, తక్షణమే విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



## వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరణం



**దేవరుప్పుల విశాలభారతి:** మండలం పెద్దమడూరు గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున దొంగ తనం ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వృద్ధురాలు కప్పరి యాదమ్మ ఇంటి వద్ద ఉదయం సుమారు 5 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు గొలుసు అపహరించినట్లు సమాచారం ఈ సంఘటనపై ఆమె కుమారుడు కప్పరి కొమురయ్య దేవరుప్పుల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దేవరుప్పుల ఎస్ఐ సృజన్ కుమార్ సంఘటనపై విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## వానాకాలం సాగుకు సన్నద్ధం కావాలి

**వ్యవసాయ శాఖ అగ్రికల్చర్ ఆఫీసర్ వీరా సింగ్**



**మరిపెడ విశాలభారతి:** వానాకాలం సాగుకు రైతులను సన్నద్ధం చేయడంలో డీలర్లు కీలక పాత్ర పోషించాలని ఏవో వీరా సింగ్ సూచించారు. వానాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన సీజన్ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువుల విక్రయాలను పూర్తిగా నిరోధించాలని హెచ్చరించారు. రైతులకు సరైన సమయంలో సరైన వ్యవసాయ సలహాలు అందించడంతో పాటు ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వానాకాలంలో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన నిల్వలను సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, డీలర్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తొలి 1000 రోజులు చిన్నారుల భవిష్యత్తుకు కీలకం

**ఏసీడీపీఓ తేజ కల్యాణి**



**మరిపెడ, విశాలభారతి:** చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాలు బలమైన పునాదిగా నిలుస్తాయని మరిపెడ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీఓ తేజ కల్యాణి తెలిపారు. శుక్రవారం మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపురం అంగన్‌వాడీ 1 కేంద్రంలో "తొలి 1000 రోజుల ప్రాముఖ్యత"పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భధారణ ప్రారంభమైన రోజు నుంచి చిన్నారి రెండేళ్లు పూర్తయ్యే వరకు ఉండే తొలి 1000 రోజులు శారీరక, మానసిక మరియు మెదడు ఎదుగుదలకు అత్యంత కీలకమని పేర్కొన్నారు. గర్భిణీలు సమతుల్య ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు వినియోగించడం ఎంతో అవసరమన్నారు. పుట్టిన వెంటనే తల్లిపాలను ప్రారంభించి, తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. దీని వల్ల చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఆరు నెలల తర్వాత పౌష్టికాహారాన్ని సరైన విధంగా అందించడం, పిల్లల ఎదుగుదలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిరంతరం పరిశీలించడం అవసరమని చెప్పారు. తొలి 1000 రోజులలో సరైన పోషకాహారం అందకపోతే పిల్లల ఎదుగుదల, చదువు, జ్ఞాపకశక్తి మరియు భవిష్యత్ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని హెచ్చరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ అభియాన్, అంగన్‌వాడీ సేవలు, గర్భిణీ మరియు బాలింతలకు అందిస్తున్న పోషకాహార పథకాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ సిబ్బంది, గర్భిణీలు మరియు బాలింతలు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ అవార్డు ప్రధానోత్సవానికి సుధీర్ కుమార్ సంగెంకు ఆహ్వానం






**ఆదిలాబాద్, విశాలభారతి:** జిల్లాలో సామాజిక కార్యకర్తగా, న్యాయవాదిగా విశేష గుర్తింపు పొందిన అడ్వకేట్ సుధీర్ కుమార్ సంగెంకు ప్రతిష్ఠాత్మక ఎన్టీఆర్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా పాల్గొనేందుకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) స్మారకార్థం సామాజిక కార్యకర్తలు, సినీ ప్రముఖులు, అలాగే వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు ఎన్టీఆర్ అవార్డులను ప్రదానం చేస్తారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మరియు సత్య సంగీత ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ అవార్డు ప్రధానోత్సవం నిర్వహించబడుతోంది. ఈ నెల 29న హైదరాబాద్‌లోని ప్రముఖ సాంస్కృతిక వేదిక త్యాగరాయ గాన సభలో ఈ కార్యక్రమం ఘనంగా జరగనుంది. ఈ వేడుకకు తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ శ్రీ వకుళాభరణం కృష్ణమోహన్, సినీ నటీమణులు రాధిక, సుప్రియ, గీతాంజలి, సత్య సంగీత ఇంటర్నేషనల్ అధ్యక్షుడు శ్రీ ఓంకార్ రాజు తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. వారి సమక్షంలో అడ్వకేట్ సుధీర్ కుమార్ సంగెం అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొని అవార్డుల ప్రదానంలో భాగస్వామ్యం కానుండటం జిల్లాకు గర్వకారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ అరుదైన అవకాశం తనకు లభించడం పూర్వజన్మ సుకృతమని అడ్వకేట్ సుధీర్ కుమార్ సంగెం ఆనందం వ్యక్తం చేశారు.

## పొంగులేటి వ్యాఖ్యలపై బీసీ సంఘాల ఆగ్రహం

- హయత్‌నగర్‌లో మంత్రి దిష్టిబొమ్మ దగ్ధం
- బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్

**అబ్దుల్లాపూర్ మెట్ , విశాలభారతి :** తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా హయత్‌నగర్ మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల విగ్రహాల వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎత్తారి భీమరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎత్తారి భీమరాజు మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ బీసీ సమాజంపై అహంకార ధోరణితో వ్యవహరించారని ఆరోపించారు. కాగితాలను విసిరేస్తూ బీసీలను చులకనగా మాట్లాడి అవమానపరిచారని మండిపడ్డారు. బీసీ సమాజాన్ని అవమానించేలా ప్రవర్తించిన మంత్రి పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ, బీసీలకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నక్క రంజిత్ గౌడ్, పిట్టల జంగం ముదిరాజ్, పీట్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొని మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీసీ వర్గాల గౌరవాన్ని కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.



# రైతు డిస్కమ్ పేరుతో రేవంత్ కుట్ర

**మొదటిపేజీ తరువాయి**



ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై నిప్పులు చెరిగారు. రైతులకు మేలు చేస్తామనే ముసుగులో ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నం భవిష్యత్తులో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే వారి మెడకు మీటర్ల ఉచ్చు బిగించేందుకు కుట్ర పన్నుతోందని ఆమె ఆరోపించారు. రైతు డిస్కమ్ ఏర్పాటు వెనుక ఉన్న మతలబుపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒకవేళ ఈ నిర్ణయం నిజంగానే రైతుల సంక్షేమం కోసమే అయితే దానిని ఎందుకు గోప్యంగా ఉంచారని ఆమె సూటిగా ప్రశ్నించారు. సుమారు రెండున్నర ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ విధానాలను గమనిస్తుంటే ఇది రైతుల ప్రయోజనాల కోసం కాదని స్పష్టమవుతోందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇప్పటికే డిస్కమ్ సంస్థలు సుమారు అరవై తొమ్మిది వేల కోట్ల రూపాయల నష్టాల్లో ఉన్నాయని గణాంకాలు చెబుతుంటే అందులో ప్రభుత్వమే యాభై నాలుగు వేల కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని ఆమె గుర్తుచేశారు. బాకీలు చెల్లించని ప్రభుత్వం కొత్తగా మరొక సంస్థను ఏర్పాటు చేసి రైతుల నెత్తిన భారాలు మోపడం ఎంతవరకు సమంజసమని ఆమె నిలదీశారు. రాష్ట్రంలోని రైతాంగం అత్యంత కష్టపడి సుమారు ఇరవై తొమ్మిది లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను వినియోగించుకుంటూ సాగును లాభసాటిగా మార్చుకున్నారని కవిత వెల్లడించారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో విద్యుత్ రంగంలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టి నాణ్యమైన విద్యుత్తును అందించడం వల్లే నేడు రాష్ట్రంలో పంట దిగుబడి గణనీయంగా పెరిగిందని ఆమె వివరించారు. గతంలో కేవలం ఇరవై లక్షల టన్నుల ధాన్యం పండే తెలంగాణ నేడు కోటి నలభై లక్షల టన్నుల ధాన్యం పండించే స్థాయికి చేరుకుందంటే అది విద్యుత్ రంగంలో తెచ్చిన విప్లవాత్మక మార్పుల వల్లే సాధ్యమైందని ఆమె స్పష్టం చేశారు. ఇప్పుడు ఈ రైతు డిస్కమ్ ఏర్పాటు చేయడం ద్వారా ఆ రైతుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆమె విమర్శించారు. ఈ విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే పాత జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయని ఆమె తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. రైతులకు అన్యాయం చేస్తూ నాటి పాలకుల మాదిరిగా ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవద్దని ఆమె ప్రభుత్వానికి హితవు పలికారు. ధరణి భూమాత పేరుతో ప్రజలను మభ్యపెట్టినట్లుగా ఇప్పుడు రైతు డిస్కమ్ పేరుతో రైతుల భూములను మోటార్లను ప్రమాదంలోకి నెట్టవద్దని ఆమె కోరారు. ఇటువంటి సున్నితమైన అంశాన్ని కేవలం ఒక చోట మాత్రమే చర్చించకుండా రాష్ట్రంలోని ముప్పై మూడు జిల్లాల్లో విస్తృతంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. రైతుల జీవితాలతో ముడిపడి ఉన్న ఈ అంశాన్ని అత్యంత పారదర్శకంగా చర్చించాల్సిన బాధ్యత నియంత్రణ మండలిపై ఉందని ఆమె ఉద్ఘాటించారు. విద్యుత్ ఉద్యోగుల అంశాన్ని కూడా ఈ సందర్భంగా కవిత ప్రస్తావించారు. రాష్ట్ర విభజన అనంతరం విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ఇరవై నాలుగు గంటల నాణ్యమైన కరెంటును అందించేలా కృషి చేశారని ఆమె కొనియాడారు. అయితే విభజన చట్టాలను తుంగలో తొక్కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తూ స్థానిక తెలంగాణ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆమె ఆరోపించారు. సుమారు పన్నెండు వందల మంది తెలంగాణ ఉద్యోగులు కష్టాల్లో ఉంటే పదిహేడు వందల మంది ఆంధ్రా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం వివక్షకు నిదర్శనమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జెన్ కో రెడ్ కో దక్షిణ విద్యుత్ సంస్థల్లో ఆంధ్రా ప్రాంతీయుల పెత్తనం కొనసాగుతోందని వెంటనే వారిని తప్పించి తెలంగాణ వారికే ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. రైతు డిస్కమ్ ప్రతిపాదన అనేది విద్యుత్ రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగమని ఆమె బలంగా నమ్ముతున్నారు. యూనిట్ కు ఆరు రూపాయల వ్యయం అయ్యే థర్మల్ విద్యుత్తును రైతులకు సరఫరా చేసే నెపంతో డిస్కమ్ ను ప్రైవేటు పరం చేసేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని ఆమె విమర్శించారు. నిజంగా రైతులకు మేలు చేయాలన్న చిత్తశుద్ధి ఉంటే ముందుగా పైలట్ ప్రాజెక్టు ద్వారా ఫలితాలను నిరూపించాలని ఆమె సవాలు విసిరారు. ఎనర్జీ ఆడిట్ పేరిట తీసుకొచ్చే ఏ పథకం కూడా ఇప్పటివరకు సక్సెస్ కాలేదని గతానుభవాలను ఆమె గుర్తుచేశారు. ఈ ప్రతిపాదన వెనుక ఉన్న ఆర్థిక వ్యూహాలు రైతులను నిలువునా ముంచేలా ఉన్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని కవిత డిమాండ్ చేశారు. కేవలం తమ నిర్ణయాలను రుద్దడం కాకుండా ప్రతిపక్షాల సలహాలను కూడా స్వీకరించాలని ఆమె కోరారు. ఒకవేళ ప్రభుత్వం ఈ ప్రతిపాదనతోనే ముందుకు వెళితే రాబోయే రోజుల్లో ప్రతి రైతు వద్దకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని ఆమె స్పష్టం చేశారు. రైతుల మోటార్లకు మీటర్లు పెట్టే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఆమె గట్టిగా డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమం దృష్ట్యా ఈ నిరంకుశ ధోరణిని వదిలి ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని ఆమె ప్రభుత్వానికి సూచించారు. రైతులకు ద్రోహం చేసే నిర్ణయాలు తీసుకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆమె హెచ్చరించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదన్నది తమ ప్రధాన ఉద్దేశమని ఆమె పునరుద్ఘాటించారు. విద్యుత్ సంస్థలు నష్టాల్లో ఉన్నాయని చెబుతూనే వాటిని సాకుగా చూపి వ్యవసాయ విద్యుత్ రాయితీలను ఎత్తివేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర రైతాంగం మొత్తం ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తోందని ఆమె పేర్కొన్నారు. వ్యవసాయం పండుగలా సాగుతున్న తరుణంలో ఇటువంటి వివాదాస్పద నిర్ణయాలతో రైతుల ఉత్సాహాన్ని నీరుగార్చవద్దని ఆమె కోరారు. ప్రతి ఒక్క రైతు కూడా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజాభిప్రాయ సేకరణ వేదికగా తాను వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆమె నియంత్రణ మండలిని కోరారు. రైతు డిస్కమ్ ప్రతిపాదనను పూర్తిగా తిరస్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో చర్చలు జరగాలని అప్పటివరకు ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఆమె కోరారు. తెలంగాణ రైతాంగం ఆత్మగౌరవాన్ని కాపాడేలా నిర్ణయాలు ఉండాలని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకుని రైతుల పక్షాన నిలబడాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాన్ని చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని ఆమె స్పష్టం చేశారు. రైతు డిస్కమ్ అంశం తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ పక్షం ఒక వాదనను వినిపిస్తుంటే రైతు సంఘాలు ప్రతిపక్షాలు మరొక వాదనతో వ్యతిరేకిస్తున్నాయి. ఏది ఏమైనా రాష్ట్ర భవిష్యత్తును ప్రభావితం చేసే ఈ నిర్ణయం విషయంలో పారదర్శకత అవసరమని అందరూ అభిప్రాయపడుతున్నారు. లక్షలాది మంది రైతుల జీవనోపాధితో ముడిపడి ఉన్న వ్యవసాయ విద్యుత్ అంశంపై ప్రభుత్వం ఎంతవరకు మొండిగా ముందుకు వెళుతుందనేది వేచి చూడాల్సిందే. రైతుల ప్రయోజనాలను కాపాడుతూనే విద్యుత్ రంగంలో సంస్కరణలు చేపట్టే మార్గాలను ప్రభుత్వం వెతుక్కోవాల్సిన సమయం ఆసన్నమైందని కవిత వ్యాఖ్యానించారు.

## భక్తి శ్రద్ధలతో మాలిక్ బాబా మలీదా ఉత్సవం

- 65 ఏళ్లుగా కొనసాగుతున్న విశిష్ట సంప్రదాయం
- మొక్కులు తీర్చే దైవంగా భక్తుల విశ్వాసం

**ఆదిలాబాద్, విశాలభారతి:**



ఆదిలాబాద్ జిల్లా హత్నూర్ మండలంలోని వర్తమాన్నూర్ గ్రామంలో బాబా మాలిక్ సబ్ దస్తగిరి బాబా దేవాలయంలో నిర్వహించే మలీదా ఉత్సవం గత 65 సంవత్సరాలుగా భక్తి శ్రద్ధలతో కొనసాగుతోంది. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఈ ఉత్సవం ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించబడుతోంది. గ్రామ పెద్దల కథనం ప్రకారం, గతంలో గ్రామంలో వర్షాభావ పరిస్థితులు నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో బాబా మాలిక్ సబ్ దర్గాలో మలీదా సమర్పించి ప్రార్థనలు నిర్వహించేవారు. ఆ తరువాత వర్షాలు కురవడం ప్రారంభమయ్యేదని స్థానికులు విశ్వసిస్తున్నారు. అప్పటి నుంచి ఈ సంప్రదాయం గ్రామంలో ఆచారంగా మారి తరతరాలుగా కొనసాగుతోంది. ఉత్సవం సందర్భంగా గ్రామస్తులు ఉదయం నుంచే నియమనిష్ఠలతో ఉండి, ఒక్కపూట భోజనం చేసి, పిండి వంటలు, నెయ్యి, బెల్లంతో ప్రత్యేకంగా తయారు చేసిన మలీదా ప్రసాదాన్ని బాబా మాలిక్ సబ్‌కు సమర్పిస్తారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకుంటారు. భక్తుల విశ్వాసం ప్రకారం, బాబా మాలిక్ సబ్ ఆశీస్సులతో ఎన్నో కోరికలు నెరవేరాయని, జీవితంలో సుఖసంతోషాలు కలిగాయని చెబుతున్నారు. అందుకే ప్రతి ఏడాది సమీప గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. ఈ ఏడాది కూడా గ్రామ ప్రజలు సంప్రదాయబద్ధంగా మలీదా ఉత్సవాన్ని నిర్వహించి, భక్తి భావంతో మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, సామరస్యానికి ప్రతీకగా ఈ ఉత్సవం నిలుస్తోందని స్థానికులు పేర్కొన్నారు

## మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు




- ఈవ్‌టీజర్లకు మెగా కౌన్సిలింగ్‌లో మల్కాజ్‌గిరి సీపీ సుమతి హెచ్చరిక
- మహిళల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

**అబ్దుల్లాపూర్ మెట్ , విశాలభారతి :**

మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్ ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి హెచ్చరించారు. నాగోల్‌లోని PMR కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన "బిహేవియరల్ రేఫారం & రెస్పాన్సిబిలిటీ ప్రోగ్రాం" సంస్కార్ మెగా కౌన్సిలింగ్ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు.మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని సీపీ సుమతి స్పష్టం చేశారు. మహిళలను ఈవ్‌టీజింగ్ చేస్తూ, వేధింపులకు పాల్పడుతున్న యువకులను గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 2026 జనవరి నుండి మే నెల వరకు షీ టీమ్స్‌కు 760 మంది పట్టుబడినట్లు వెల్లడించారు. మహిళలను వేధిస్తున్న కేసుల్లో 61 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 231 మందిపై పెట్టి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిపి సుమతి మాట్లాడుతూ.. మహిళలను వేధిస్తున్న వారిలో 180 మంది మైనర్లు ఉండటం ఆందోళనకరమని అన్నారు. అలాగే 24 సంవత్సరాల లోపు యువత అధికంగా ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. 50 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తులు కూడా ఇలాంటి కేసుల్లో పట్టుబడటం సమాజంలో నైతిక విలువలు తగ్గుతున్న సంకేతమన్నారు.మహిళలను వేధించడం సరదా కాదు.. అది నేరం. ఒక చిన్న తప్పిదం మీ జీవితాన్ని చీకటిలోకి నెట్టేస్తుంది. యువత తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి అని సీపీ సుమతి సూచించారు. మహిళలు, బాలికలు భయపడకుండా స్వేచ్ఛగా తిరిగే వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేశామని, కాలనీలు, పబ్లిక్ ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే ఎలాంటి శక్తులనైనా సహించబోమని హెచ్చరించిన సీపీ, తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై పర్యవేక్షణ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగోల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, మహిళా పోలీస్ అధికారులు, సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో తాపీ మేస్త్రీల ఆందోళన

- ఆత్మగౌరవ సభకు పిలుపు




**రాజేంద్రనగర్, విశాలభారతి :** శంషాబాద్ మండలంలో తాపీ మేస్త్రీలు తమ ఆత్మగౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ రంగంలో తమ పాత్రను తక్కువ చేసి చూపించడం, అవహేళన చేయడం తీవ్రంగా అభ్యంతరకరమని తాపీ మేస్త్రీల సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం శంషాబాద్ పురపాలక పరిధిలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, జూన్ 8న భాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న తాపీ మేస్త్రీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భవన నిర్మాణానికి తాపీ మేస్త్రీలే ప్రధాన బలం అని, వారి సేవలను విస్మరించడం అన్యాయమని తెలిపారు. ఇటీవల సెంట్రింగ్ కాంట్రాక్టర్లు చేపట్టిన సమ్మె సందర్భంగా "తాపీ మేస్త్రీ హటావో" వంటి నినాదాలు ఇవ్వడం కార్మికుల ఐక్యతకు విఘాతం కలిగిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాలో తాపీ మేస్త్రీలను కించపరుస్తూ ప్రచారం చేయడం దారుణమని, ఇది వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణంలో తాపీ, సెంట్రింగ్ కార్మికులు విడదీయరాని భాగాలుగా పనిచేస్తారని గుర్తు చేశారు. సమ్మెలు నిర్వహించేటప్పుడు సంబంధిత సంఘాలను సంప్రదించకుండా నిర్ణయాలు తీసుకోవడం సరైన పద్ధతి కాదని, కార్మికుల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. "ఒక భవనం బలంగా, అందంగా నిర్మించాలంటే ప్రతి కార్మికుడి శ్రమ అవసరం. తాపీ మేస్త్రీ పాత్రను తగ్గించి మాట్లాడడం అన్యాయం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు మరియు కార్మికులు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కార్మికుల సమ్మె విరమణ

- 15 రోజులుగా కొనసాగిన సమ్మె విజయవంతం
- నేటి నుంచి యధావిధిగా సెంట్రింగ్ పనులు
- అసోసియేషన్ సీతాఫల్మండి అధ్యక్షులు అంబాల రాజేశ్వరరావు




**ముషీరాబాద్ విశాలభారతి:** గత 15 రోజులుగా కొనసాగుతున్న సెంట్రింగ్ కార్మికుల సమ్మె విజయవంతంగా ముగిసిందని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సీతాఫల్మండి అధ్యక్షులు అంబాల రాజేశ్వరరావు తెలిపారు.తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. శుక్రవారం బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం అసోసియేషన్ సభ్యులతో కలిసి అంబాల రాజేశ్వరరావు మాట్లాడారు. గత 15 రోజులుగా కొనసాగిన సెంట్రింగ్ కార్మికుల సమ్మె నేటితో ముగిసిందని కార్మికులు యధావిధిగా సెంట్రింగ్ పనులు నిర్వహిస్తూ ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ప్రభుత్వం సమస్యలపై సానుకూలంగా స్పందించిందన్నారు. 15 రోజులుగా చేసిన నిరసన ధర్నాలు ర్యాలీలతో వివిధ రాజకీయ నాయకులు మద్దతుతో నిరసన తెలిపామని చెప్పారు. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కొంత సమయం కోరినట్లు వివరించారు. సెంట్రింగ్ స్క్వేర్ ఫీట్ 51 రూపాయికి ఫిక్స్ రేటు నిర్ణయించడం జరిగిందని చెప్పారు. పెరిగిన రేట్లు నేటి నుండి అమల్లోకి వస్తుందన్న సెంట్రింగ్ బంద్ ను విరమించుకుంటున్నామని తెలిపారు. సెంట్రల్ కమిటీ నిర్ణయం మేరకు ఎవరి జోన్ పరిధిలో వారు అగ్రిమెంట్ ప్రకారం పనులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్మండి అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా నిర్వహణ

**మొయినాబాద్ , విశాలభారతి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలు - 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా సాధికారత మరియు ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న "ఇందిరా మహిళా శక్తి" పథకంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలు, పట్టణ మహిళా సమాఖ్యలకు ఆర్థిక రుణాల మేళాను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మొయినాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి షాబాద్ సోనియా దర్శన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ, స్వయం ఉపాధి రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. చిన్న వ్యాపారాలు నిర్వహించే మహిళలకు సకాలంలో రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకు అధికారులను కోరారు. బ్యాంక్ లింకేజ్ ద్వారా వచ్చే రుణాలను సమర్థవంతంగా వినియోగించుకుని మహిళలు కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవాలని అన్నారు.

## కేన్స్ వేదికపై పోచంపల్లి ఇకత్ ప్రతిష్ట

**రష్మి ఠాకూర్‌కు ఘన స్వాగతం**



**రాజేంద్రనగర్, విశాలభారతి:** ఫ్రాన్స్‌లో జరిగిన 79వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పోచంపల్లి ఇకత్ హ్యాండ్లూమ్‌ను అంతర్జాతీయ రెడ్ కార్పెట్‌పై ప్రదర్శించి తెలంగాణకు గర్వకారణమైన గుర్తింపును తీసుకువచ్చిన తెలంగాణ హ్యాండ్లూమ్స్ బ్రాండ్ అంబాసడర్ రష్మి ఠాకూర్‌కు శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోచంపల్లి నేతన్నలు ఘన స్వాగతం పలికారు. పోచంపల్లి హ్యాండ్లూమ్ టై అండ్ డై సిల్క్ సారీస్ మాన్యుఫాక్చరర్స్ ట్రస్ట్ మరియు పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ స్వాగత కార్యక్రమానికి నేతన్నలు, హ్యాండ్లూమ్ రంగ ప్రతినిధులు, మహిళా కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కేన్స్ ఫెస్టివల్‌లో రష్మి ఠాకూర్ ధరించిన ప్రత్యేక దుస్తులు తెలంగాణ మాస్టర్ వీవర్స్ చేతులతో నేసిన అసలైన పోచంపల్లి ఇకత్‌తో రూపొందించబడినవి. "పోచంపల్లి టు కేన్స్" అనే థీమ్‌తో రూపొందించిన ఈ దుస్తులు జియోగ్రాఫికల్ ఇండికేషన్ (GI) గుర్తింపు పొందిన భారతీయ హ్యాండ్లూమ్ సంప్రదాయాన్ని ప్రపంచానికి పరిచయం చేశాయి. ఈ సందర్భంగా రష్మి ఠాకూర్ మాట్లాడుతూ, ఈ గౌరవం పోచంపల్లి నేతన్నలందరికీ చెందిందని, తరతరాలుగా ఈ కళను కాపాడుతున్న వారి కృషి వల్లే ఈ స్థాయికి చేరుకుందని తెలిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ, పోచంపల్లి ఇకత్‌కు అంతర్జాతీయ గుర్తింపు రావడం తెలంగాణ హ్యాండ్లూమ్ రంగానికి మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి కార్మిక సంఘం ప్రతినిధులు, చెనేత కార్మికులు పాల్గొని రష్మి ఠాకూర్‌ను సన్మానించారు.

## కోహెడ మార్కెట్ శంకుస్థాపనకు భారీ ఏర్పాట్లు

**సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేస్తాం – గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి**





**అబ్దుల్లాపూర్‌మెట్ , విశాలభారతి :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని కోహెడలో నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి భారీ బహిరంగ సభ ఏర్పాట్లను గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రతినిధులు పరిశీలించారు. జూన్ 3వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్‌కు శంకుస్థాపన జరగనున్న నేపథ్యంలో సభా ప్రాంగణం, వేదిక నిర్మాణం, పార్కింగ్, తాగునీటి సౌకర్యం, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను అధికారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. కోహెడలో ఏర్పాటు కానున్న అంతర్జాతీయ సమీకృత మార్కెట్ రాష్ట్రంలోనే ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా నిలవనుందని తెలిపారు. రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు ఒకే వేదికపై అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నట్లు చెప్పారు. సభ విజయవంతం కోసం మార్కెట్ కమిటీ, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, కోహెడ మార్కెట్ నిర్మాణంతో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు కొత్త దిశ లభిస్తుందని పేర్కొన్నారు. రైతులకు ఆధునిక వసతులు కల్పించడం ద్వారా వ్యవసాయ రంగానికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర చారి, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు బండి మధుసూదన్ రావు, అంజయ్య, రఘుపతి రెడ్డి, మచ్చేందర్ రెడ్డి, నవరాజ్, వెంకటేశ్వర్లు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సంగీత విభావరి



**సికింద్రాబాద్, విశాలభారతి:** మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ గారి 103వ జయంతి సందర్భంగా సికింద్రాబాద్‌లో ఎన్టీఆర్ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. సీతాఫల్మండి అంబేద్కర్ విగ్రహం సమీపంలో పార్టీ సికింద్రాబాద్ ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో పాల్గొన్న మాజీ మేయర్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పార్టీ క్యాడర్ బలంగా ఉందని, త్వరలోనే టీడీపీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలంగాణలో పార్టీ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందని అన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నందమూరి రామకృష్ణ భావోద్వేగానికి గురయ్యారు. తన తండ్రి ఎన్టీఆర్ ప్రజల కోసం జీవితాంతం కష్టపడ్డారని గుర్తుచేసుకుంటూ.. ఆకాశం, భూమి, సూర్య చంద్రులు ఉన్నంతకాలం తారక రామస్మరణ నిరంతరం వినిపిస్తుందని, కారణజన్ముడుగా జన్మించిన మా నాన్న నట జీవితంలో పాటు నిజ జీవితంలో పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో నిద్రలేని ఉపవాస రాత్రులు గడిపారని ఆవేదన వ్యక్తపరుస్తూ, తన తండ్రి చలనచిత్రాలలో నటన కోసం చేసిన పాత్రలను పోషించడానికి తన కంటి చూపుని సైతం పోగొట్టుకున్నాడని కంటతడి పెట్టారు. అటువంటి పుణ్య దంపతుల కడుపులో పుట్టడం నిజంగా పూర్వజన్మ సుకృతమని ఆయన అన్నారు .ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు నందమూరి రామకృష్ణ, తీగల కృష్ణారెడ్డి, కూన శ్రావన్‌లను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం మిత్ర బృందంచే నిర్వహించిన ఎన్టీఆర్ సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఈకార్యక్రమంలో విజయ్ కుమార్, కృష్ణ, నాగ మల్లీశ్వరి, వీరయ్య ప్రవీణ్ కుమార్, చిరంజీవి రాజు, పొట్టి శ్రీను, శేషి రెఖ నాయుడు, వెంకటస్వామి, మురళి కృష్ణ , రాహుల్, చందర్ ముదిరాజ్, దేవేందర్ , చంద్రమోహన్ , కట్టరాములు , నల్లగుట్ట రాజు, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోహెడలో వృద్ధురాలి అనుమానాస్పద మృతి

- **ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న మహిళ మృతదేహం గుర్తింపు**
- **గాజులు కనిపించకపోవడంతో మిస్టరీగా మారిన ఘటన**

**అబ్దుల్లాపూర్‌మెట్ , విశాల భారతి :** అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని కోహెడ గ్రామంలో వృద్ధురాలి అనుమానాస్పద మృతి స్థానికంగా కలకలం రేపింది. ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధ మహిళ మృతదేహం అనుమానాస్పద పరిస్థితుల్లో కనిపించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హయత్‌నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోహెడ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయం వెనుక భాగంలో ఉన్న ఇంటి నెంబర్ 2101లో నివాసం ఉంటున్న కారె అందాలమ్మ (85) మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలు కారె అందాలమ్మ దివంగత పాపిరెడ్డి భార్య కాగా, ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కుటుంబ సభ్యులు వేరే ప్రాంతాల్లో నివసిస్తుండగా, అందాలమ్మ మాత్రం కోహెడలో ఒంటరిగా ఉంటున్నట్లు తెలిసింది.సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహంపై ఎటువంటి బాహ్య గాయాలు గుర్తించలేదని తెలిపారు. అయితే ఆమె ఎప్పుడూ చేతులకు ధరించే బంగారు గాజులు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. దీంతో ఈ ఘటన సహజ మరణమా..? లేక దొంగతనం కోణంలో ఏదైనా జరిగిందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.వృద్ధురాలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించిన పోలీసులు, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.ఈ ఘటనపై పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉందని హయత్‌నగర్ పోలీసులు తెలిపారు.

# చేతులు తడిపితే డ్రైవింగ్ లైసెన్స్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



రవాణా శాఖ పరిధిలోని ఆర్టీఓ కార్యాలయాలు పౌర సేవా కేంద్రాలుగా కాకుండా అవినీతి అడ్డాలుగా మారుతున్నాయన్న ఆరోపణలు రోజురోజుకూ బలపడుతున్నాయి. ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను జోడించి వాహన్ పోర్టల్ ద్వారా అన్ని సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. డిజిటలైజేషన్ వల్ల దళారుల వ్యవస్థ కనుమరుగు అవుతుందని భావించిన సామాన్య వాహనదారులకు నిరాశే మిగిలింది. పారదర్శకమైన పాలన అందించాలన్న ప్రభుత్వ ఆశయం కార్యాలయాల గడప దాటగానే నీరుగారిపోతోంది. రవాణా కార్యాలయాల ఆవరణలో తిష్టవేసిన మధ్యవర్తుల హవా యథేచ్ఛగా సాగుతోంది. ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకుని నేరుగా కార్యాలయానికి వచ్చే పౌరులకు ఏదో ఒక సాకుతో పనిని తిరస్కరించడం పరిపాటిగా మారింది. ఇటీవల అవినీతి నిరోధక శాఖ అధికారులు చేపట్టిన మెరుపు దాడులు రవాణా శాఖలోని అక్రమ బాగోతాలను బట్టబయలు చేశాయి. మేడ్చల్, పేట్‌బషీరాబాద్, కొండాపూర్ రవాణా కార్యాలయాల్లో ఏకకాలంలో నిర్వహించిన సోదాలు దళారుల సామ్రాజ్యం ఎంత విస్తరించిందో స్పష్టం చేస్తున్నాయి. ఈ తనిఖీల్లో సుమారు ఇరవై మందికి పైగా ప్రైవేటు వ్యక్తులను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఎటువంటి అధికారిక హోదా లేని వ్యక్తులు కార్యాలయాల లోపల ఫైళ్లను సర్దుబాటు చేయడం, అధికారులకు అప్పగించడం వంటి దృశ్యాలు సిబ్బంది, దళారుల మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని వెల్లడిస్తున్నాయి. ఈ అక్రమ దందా వల్ల ప్రభుత్వ ఖజానాకు అందాల్సిన ఆదాయం పక్కదారి పడుతోంది. సాధారణ పౌరులు తమ వాహన పత్రాలను పొందడానికి పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకుని, అన్ని ధృవీకరణ పత్రాలతో వెళ్లే దరఖాస్తుదారులను వివిధ కారణాలతో తిప్పి పంపడం అధికారులకు అలవాటుగా మారింది. ఒకవేళ ఏజెంట్‌ను సంప్రదిస్తే మాత్రం అదే పని నిబంధనలతో సంబంధం లేకుండా నిమిషాల వ్యవధిలో పూర్తవుతోంది. లెర్నింగ్ లైసెన్స్ నుండి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ల జారీ వరకు ప్రతి దశలోనూ ఏజెంట్లు ఒక రేటును ఖరారు చేస్తున్నారు. ఈ ధరలు ప్రభుత్వ ఫీజుల కంటే రెట్టింపు స్థాయిలో ఉండటం గమనార్హం. దళారులు అడిగినంత ముట్టజెప్పనిదే ఏ ఫైలు కూడా కదలని దుస్థితి నెలకొంది. డ్రైవింగ్ స్కూళ్ల పాత్ర ఈ అక్రమాల్లో కీలకంగా మారింది. డ్రైవింగ్ నేర్పించాల్సిన స్కూళ్లు కేవలం లైసెన్సులను ఇప్పించే ఏజెంట్లుగా మారుతున్నాయి. నిబంధనల ప్రకారం శిక్షణ పొందిన వారికే లైసెన్స్ ఇవ్వాలి, కానీ కొన్ని డ్రైవింగ్ స్కూళ్లు ఆర్టీఓ సిబ్బందితో కుమ్మక్కై అనర్హులకు సైతం డ్రైవింగ్ అనుమతులు ఇప్పిస్తున్నాయి. డ్రైవింగ్ టెస్టుకు హాజరుకాకుండానే పాస్ అయ్యేలా చేసేందుకు కొన్ని వేల రూపాయలను దళారులు వసూలు చేస్తున్నారు. శిక్షణ కేంద్రాల నిర్వాహకులు, కార్యాలయ సిబ్బంది కలిసి సాగిస్తున్న ఈ అనైతిక బంధం రోడ్డు భద్రతకు పెను సవాలుగా మారుతోంది. నిబంధనల తుంగలో తొక్కి ఇస్తున్న ఈ లైసెన్సుల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఏసీబీ తనిఖీల్లో వెల్లడైన మరొక ఆశ్చర్యకరమైన విషయం బయోమెట్రిక్ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు. సామాన్యులను గంటల తరబడి వేచి చూసేలా చేస్తూ, దళారుల ద్వారా వచ్చే ఫైళ్లను మాత్రం ప్రాధాన్యత క్రమంలో క్లియర్ చేస్తున్నారని అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. టెస్ట్ డ్రైవ్ సమయంలోనూ వాహన చోదకులు కాకుండా మరెవరో డ్రైవింగ్ చేస్తున్నట్లు గుర్తించడం గమనార్హం. ఫైళ్ల కదలికపై ఉన్న పర్యవేక్షణ లోపం దళారులకు వరంగా మారింది. ఆర్టీఓ కార్యాలయాల్లో ఉన్న సిబ్బంది కొరతను సాకుగా చూపి దళారుల సహాయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ తతంగంపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌర సమాజం డిమాండ్ చేస్తోంది. ఈ అక్రమ దందాలో సుమారుగా తొంభై శాతం కార్యాలయాల్లో ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని క్షేత్రస్థాయి విశ్లేషణలు చెబుతున్నాయి. ప్రతి సంవత్సరం లక్షలాదిగా జారీ అయ్యే లైసెన్సులలో పదిహేను శాతం వరకు దళారుల ప్రమేయంతోనే వెళ్తున్నట్లు అంచనా. ఈ అక్రమ రాబడిలో అధికారులకు కూడా వాటాలు అందుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఏసీబీ సోదాల తర్వాత కొన్ని రోజులు కార్యాలయాల్లో సందడి తగ్గినప్పటికీ, తిరిగి యథాతథ స్థితికి చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవస్థీకృత అవినీతిని అరికట్టడానికి కేవలం దాడులే పరిష్కారం కాదని, పారదర్శకమైన పర్యవేక్షణ అవసరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సాంకేతికత అందుబాటులో ఉన్నా మానవ తప్పిదాల వల్ల వ్యవస్థ బలహీనపడుతోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాహన్ పోర్టల్ పట్ల పౌరులకు నమ్మకం సన్నగిల్లుతోంది. ఒక సాధారణ పౌరుడు తాను చెల్లించిన ప్రభుత్వ ఫీజుకు తగ్గట్టుగా సేవలు పొందలేక పడుతున్న వేదన వర్ణనాతీతం. ఏజెంట్ల దోపిడీని నిరోధించేందుకు ప్రత్యేక నిఘా విభాగాలను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది. కార్యాలయాల లోపలి సీసీటీవీ దృశ్యాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలి. ఏజెంట్ల ప్రమేయం లేకుండానే పనులు జరిగేలా కఠిన నిబంధనలను అమలు పరచాలి. అవినీతికి పాల్పడే సిబ్బందిపై వేటు వేయడం ద్వారా మాత్రమే పౌరుల్లో భరోసా కల్పించవచ్చు. రవాణా శాఖలోని ఈ లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీఓ కార్యాలయాల పనితీరును అంచనా వేయడానికి ఒక స్వతంత్ర కమిటీని నియమించాలి. తనిఖీలను పక్కాగా నిర్వహించి అక్రమాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. ఏజెంట్ల ఏరివేతకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ఆచరణలో ఉండాలి. సామాన్యులకు భారం కాకుండా సేవలందించడం రవాణా శాఖ ప్రాథమిక బాధ్యత. సాంకేతికతను వాడుకోవడంలో వస్తున్న మార్పులు సేవల వేగంలోనూ కనిపించాలి. లేనిపక్షంలో డిజిటలైజేషన్ లక్ష్యం విఫలమవుతుంది. దళారుల వ్యవస్థను నిర్మూలించే దిశగా కఠినమైన చట్టాలను అమలు చేయడంలో జాప్యం చేయకూడదు. ఈ సమస్య కేవలం కొన్ని కార్యాలయాలకు పరిమితం కాలేదు, మొత్తం రవాణా వ్యవస్థనే వెక్కిరిస్తోంది. లక్షలాది మంది వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేయడం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యతాంశం కావాలి. అక్రమాలకు పాల్పడే ఏజెంట్లకు సహకరించే అధికారుల గుర్తింపును పకడ్బందీగా చేపట్టాలి. నిఘా వ్యవస్థను బలోపేతం చేసి కార్యాలయాల్లో దళారుల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించాలి. ప్రజల సౌకర్యం కోసం తెచ్చిన విధానాలు ప్రజలకే భారం కావడం దురదృష్టకరం. వ్యవస్థలోని లోపాలను సరిదిద్దే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాల్సిన సమయం ఆసన్నమైంది. పారదర్శకత లేని సేవలు వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. రవాణా శాఖలో జరుగుతున్న అక్రమాలను అరికట్టడం ద్వారా మాత్రమే డిజిటల్ పాలన సఫలం అవుతుంది. వాహనదారుల నుండి వసూలు చేస్తున్న అదనపు మొత్తాలను నియంత్రించడం ద్వారా వారిపై భారాన్ని తగ్గించవచ్చు. ఏసీబీ దాడులు ఆరంభం మాత్రమే కావాలి, అంతిమంగా దోషులందరికీ శిక్ష పడాలి. అప్పుడు మాత్రమే సామాన్యులకు నిజమైన సేవలు అందుతాయి. ప్రభుత్వం ఈ విషయంలో కఠినమైన నిర్ణయాలు తీసుకుని, రవాణా కార్యాలయాలను నిజమైన పౌర సేవా కేంద్రాలుగా మార్చాలి. అక్రమ దందాకు స్వస్తి పలికి పారదర్శక పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యం కావాలి. దీనికోసం ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయడమే ప్రస్తుత తరుణంలో అవసరం.

## విద్యార్థులకు సురక్షిత రవాణా.. ట్రాఫిక్ రద్దీకి చెక్



**సమావేశంలో పాల్గొన్న ఆయా విభాగాల అధికారులు**

**సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ నేతృత్వంలో తల్లిదండ్రులతో సమావేశం**

**సైబరాబాద్ - విశాల భారతి**

విద్యార్థుల భద్రత, సురక్షిత రవాణాతో పాటు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించే లక్ష్యంతో సైబరాబాద్ పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్, ఎస్సీఎస్సీ చైర్మన్ డాక్టర్ ఎం. రమేష్ శుక్రవారం కమిషనరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి యూట్యూబ్ వేదికగా విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యక్ష సమావేశం నిర్వహించారు.నగర వ్యాప్తంగా విద్యార్థుల రవాణా వ్యవస్థను సాంకేతికతతో అనుసంధానించి, సమాజ భాగస్వామ్యంతో, పోలీసు ధ్రువీకరణతో కూడిన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు సీపీ తెలిపారు. దీనికి స్టూడెంట్ మొబిలిటీ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అని పేరు పెట్టారు. పాఠశాలలు, కళాశాలల వద్ద పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, అసురక్షిత రవాణా విధానాలు, రవాణా సామర్థ్యం పూర్తిగా వినియోగం కాకపోవడం వంటి సమస్యలకు పరిష్కారంగా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నామని వివరించారు. తల్లిదండ్రులు, విద్యా సంస్థలు, రవాణా ఆపరేటర్లు, పౌర సంస్థల సమన్వయంతో ఈ కార్యక్రమం అమలు కానుంది.ఈ నమూనాలో భాగంగా ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు రవాణా సేవలను పారదర్శకత, నిబంధనల అనుసరణతో కూడిన వేదిక ద్వారా అనుసంధానిస్తారు. విద్యార్థుల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు శిక్షణ పొందిన, పోలీసు ధ్రువీకరణ కలిగిన గిగ్ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలను అటెండెంట్లుగా, మొబిలిటీ సూపర్‌వైజర్లుగా నియమిస్తారు. దీనివల్ల వారికి అదనపు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయి.సమావేశంలో సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ పాఠశాలలు వదిలే సమయంలో కేవలం పదిహేను నిమిషాల వ్యవధిలోనే పాఠశాలల పరిసరాల్లో దాదాపు రెండు లక్షల వాహనాలు గుమిగూడుతున్నాయని తెలిపారు. కొన్నిసార్లు ఇది సైబరాబాద్ ఐటీ కారిడార్ రద్దీ సమయాన్ని మించిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల చుట్టూ ట్రాఫిక్ రద్దీ ప్రధాన పౌర సమస్యగా మారిందని, ఇది రహదారి భద్రత, కుటుంబాల సమన్వయం, పిల్లల శ్రేయస్సుపై ప్రభావం చూపుతోందని అన్నారు. పిల్లలను దించేందుకు, తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు ఒత్తిడిలో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, సమాచార లోపం కారణంగా పిల్లలు పాఠశాలల్లోనే ఉండిపోయిన ఘటనలు ఉన్నాయని వివరించారు. ఇది తాత్కాలిక ట్రాఫిక్ పరిష్కారం కాదని, దీర్ఘకాలిక పౌర రవాణా సంస్కరణ అని స్పష్టం చేశారు. సైబరాబాద్ పోలీసులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా 526 విద్యా సంస్థలు, దాదాపు నాలుగు లక్షల పది వేల మంది విద్యార్థులతో సర్వే నిర్వహించారు. ప్రస్తుత విద్యార్థి రవాణా వ్యవస్థలో ఉన్న ప్రధాన లోపాలను ఈ సర్వేలో గుర్తించినట్లు సీపీ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ట్రాన్స్‌పోర్ట్ ఫర్ లండన్ నమూనా నుంచి స్ఫూర్తి పొంది ఈ ఫ్రేమ్‌వర్క్ రూపొందించామని, సైబరాబాద్‌లోనూ అదే తరహా సాంకేతిక సమన్వయ, పర్యవేక్షణ వ్యవస్థలను అమలు చేస్తామని చెప్పారు.ప్రతిపాదిత వేదికలో రూట్ ఆప్టిమైజేషన్ వ్యవస్థలు, నిబంధనల పర్యవేక్షణ, కేంద్రీకృత కార్యాచరణ నియంత్రణ, డిజిటల్ సమన్వయం, ఎస్సీఎస్సీ పాలనలో స్మార్ట్ మొబిలిటీ నిర్వహణ ఉంటాయి. మొబిలిటీ రంగంలో ఇప్పటికే పనిచేస్తున్న ఒక స్టార్టప్‌ను సాంకేతిక, వ్యవస్థ భాగస్వామిగా అంచనా వేస్తున్నారు. విద్యార్థుల రవాణా డేటా విశ్లేషణ, గేట్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలు, తల్లిదండ్రుల అవగాహన కార్యక్రమాలు, నియంత్రిత రూట్ ప్రణాళికతో ఈ ప్రాజెక్టు ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనే వాహనాలన్నింటికీ సీసీటీవీ వ్యవస్థలను అనుసంధానిస్తారు. సైబరాబాద్ పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వీటిని నిరంతరం పర్యవేక్షిస్తారు. యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసిన ఈ సమావేశానికి ఐదు వేల మంది తల్లిదండ్రులు ప్రత్యక్షంగా కనెక్ట్ అయ్యారు. విద్యా సంస్థలు, ఇతర భాగస్వాములు కూడా పాల్గొన్నారు.ఈ సమావేశంలో శేరిలింగంపల్లి డీసీపీ సి హెచ్ శ్రీనివాస్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, ఎస్సీఎస్సీ సీఈఓ నవేద్ ఖాన్, విద్యార్థి రవాణా వ్యవస్థ ప్రతినిధులు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



**యూట్యూబ్ వేదికగా తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్**

## ఘనంగా రెండవ రోజు "ప్రశిక్షణ మహాభియాన్" ముగింపు కార్యక్రమం

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో విశేష ఉత్సాహం**





**రాజేంద్రనగర్, విశాలభారతి :** రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ప్రగతి రిసార్ట్‌లో నిర్వహిస్తున్న భారతీయ జనతా పార్టీ శిక్షణ మహాభియాన్ కార్యక్రమం రెండవ రోజు ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారు హాజరై కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు గారు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్, బీజేపీ కార్యవర్గ సభ్యులు శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి గారు రాష్ట్ర ముఖ్య నాయకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం జరిగిన ప్రత్యేక సమావేశంలో పార్టీ చరిత్ర వికాసం అంశంపై చర్చలు నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్ రావు గారు పాల్గొని పార్టీ సిద్ధాంతాలు, కార్యకర్తల పాత్ర, భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా భూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసికట్టుగా పని చేస్తే పార్టీ మరింత బలపడుతుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కోహెడ ఫ్రూట్ మార్కెట్ భూములపై రాజకీయ వేడి

- **రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కలిసిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి**
- **భూములు కోల్పోతున్న రైతుల్లో ఆందోళన**



**అబ్దుల్లాపూర్‌మెట్ , విశాల భారతి :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం కోహెడ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం కోసం భూముల స్వాధీనం వ్యవహారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారుతోంది. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డిను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం కోసం ఇప్పటికే భూమిని కేటాయించినప్పటికీ, ప్రస్తుతం కొత్తగా కోహెడ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 167/1లో సుమారు 264 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునే ప్రక్రియ చేపట్టడం అన్యాయమన్నారు. ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 160 మంది రైతు కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయని తెలిపారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను కోల్పోతే రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని పేర్కొంటూ, రైతుల పరిస్థితిని ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అనుకూలంగా అమలు చేసిన విధంగా సరైన నష్టపరిహారం ప్రకటించి, రైతులకు పూర్తి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 3వ తేదీన ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో, అంతకుముందే రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రైతుల అభిప్రాయాలను పక్కనబెట్టి ఏకపక్షంగా ముందుకెళ్తే ఉద్యమాలు తప్పవని హెచ్చరించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అదేవిధంగా సమస్యపై ప్రశ్నిస్తున్న రైతులపై అరెస్టులు, బెదిరింపులు, దాడులు వంటి చర్యలకు పాల్పడకుండా ప్రభుత్వం సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం ప్రశ్నిస్తున్న రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు మంచిరెడ్డి కిషన్ రెడ్డి తెలిపారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, భూ బాధితులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకంలో భారీ అవకతవకలు..?

- వారానికి ఆరు రోజులు పనికి వచ్చినా... మూడు రోజులే హాజరు ఇస్తున్నారట
- ఫోటో క్యాప్చర్‌లో పూర్తి హాజరు కనిపిస్తున్నా కూలీలకు అన్యాయం చేస్తున్న టీపీ టెక్నికల్ అసిస్టెంట్ మల్సూర్‌పై ఆరోపణలు
- డబ్బులు ఇస్తేనే పూర్తి హాజరు... లేదంటే వేతనాలకు కత్తెర అంటూ కూలీల ఆవేదన
- పని చేసిన పేదల పేర్లు మాయం... పనికిరాని వారి ఖాతాల్లో డబ్బుల జమపై గ్రామంలో తీవ్ర చర్చ
- ఉపాధి హామీ పథకాన్ని దోపిడీ కేంద్రంగా మార్చారని గ్రామ ప్రజల మండిపాటు
- టీపీ టెక్నికల్ అసిస్టెంట్ మల్సూర్‌పై వెంటనే విచారణ జరిపి సస్పెండ్ చేయాలి – మాచర్ల హరీష్ డిమాండ్
- జిల్లా కలెక్టర్, విజిలెన్స్ అధికారులు స్పందించకపోతే ఆందోళనలు తప్పవని గ్రామ ప్రజల హెచ్చరిక
- గుండ్రాతి మడుగులో కూలీల చెమటకు కమీషన్ రేట్లు వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలు
- తక్షణమే టి ఏ టెక్నికల్ అసిస్టెంట్ మల్సూర్ ను సస్పెండ్ చేయాలి మచ్చర్ల హరీష్ డిమాండ్ చేశారు



**కురవి విశాల భారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతి మడుగు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భారీ అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పేదల బతుకుదెరువు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని కొందరు అధికారులు, సిబ్బంది అక్రమ సంపాదనకు అడ్డాగా మార్చేశారంటూ గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. గ్రామంలోని కూలీలు ఎండలో చెమటోడ్చి పనులు చేసినా, వారి హాజరును రికార్డుల్లో పూర్తిగా నమోదు చేయడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ కూలీలు చెబుతున్న వివరాల ప్రకారం. వారానికి ఆరు రోజుల పాటు పనులకు హాజరైనా, మస్టర్ రోల్స్‌లో మాత్రం రెండు లేదా మూడు రోజులే నమోదు చేస్తున్నారట. “డబ్బులు ఇస్తేనే పూర్తి హాజరు వేస్తారు. లేదంటే పని చేసిన రోజులు కూడా కనిపించవు” అంటూ పలువురు కూలీలు ఆరోపిస్తున్నారు. ఇంకా ఆశ్చర్యకర విషయం ఏమిటంటే, అసలు పనికి రాని కొందరి పేర్లతో పూర్తి హాజరు నమోదు చేసి వారి ఖాతాల్లో వేతనాలు జమ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో నిజంగా పని చేసిన పేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని గ్రామ ప్రజలు చెబుతున్నారు. గ్రామంలో మేట్‌ల ద్వారా డబ్బులు వసూలు చేసి ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీపీ టెక్నికల్ అసిస్టెంట్‌లకు చేరుస్తున్నారనే ఆరోపణలు పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. పని చేసిన కూలీల జాబ్ కార్డుల్లో తారుమార్లు చేసి, పని దినాల్లో కోతలు పెడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. డబ్బులు ఇవ్వని కూలీల వేతనాలను ఉద్దేశపూర్వకంగా నిలిపివేస్తున్నారని, దీంతో పేద కుటుంబాలు అప్పుల పాలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**టీపీ టెక్నికల్ అసిస్టెంట్ మల్సూర్‌పై తీవ్ర ఆరోపణలు "పేదల చెమటను కూడా వదలడం లేదు" – మాచర్ల హరీష్ ఆగ్రహం.**

ఈ వ్యవహారంపై స్పందించిన మాచర్ల హరీష్, బీసీ ప్రజా సంఘం కొరవి మండల అధ్యక్షుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ... “ఉపాధి హామీ పథకం పేద కూలీలకు బతుకుదెరువు కావాలి. కానీ గుండ్రాతి మడుగులో జరుగుతున్న పరిస్థితులు చూస్తుంటే పేదల చెమటను కూడా కొందరు అధికారులు దోచుకుంటున్నట్లు కనిపిస్తోంది. పని చేసిన కూలీలకు న్యాయం చేయకుండా డబ్బులు డిమాండ్ చేయడం దారుణం. వారానికి ఆరు రోజులు పనిచేసిన కూలీలకు మూడు రోజులే హాజరు నమోదు చేయడం వెనుక పెద్ద స్థాయి అవినీతి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి,” అని మండిపడ్డారు. వారు మాట్లాడుతూ... “పని చేయని వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతుంటే, నిజంగా పని చేసిన కూలీల వేతనాలు ఎందుకు నిలిచిపోతున్నాయి..? దీనికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. గ్రామంలో జరుగుతున్న వ్యవహారాన్ని చూస్తుంటే మొత్తం పథకమే మేట్‌ల చేతుల్లో నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఫీల్డ్ అసిస్టెంట్‌లు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని గ్రామ ప్రజలు చెబుతున్నారు. పేద కూలీలను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న వారిని వెంటనే విధుల నుంచి తొలగించాలి,” అని డిమాండ్ చేశారు. టీపీ టెక్నికల్ అసిస్టెంట్ మల్సూర్‌పై వస్తున్న ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిపి, అవినీతి నిరూపితమైతే సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. “పేదల కడుపు కోసి సంపాదించే వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి. లేకపోతే గ్రామ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం,” అని హెచ్చరించారు.

**వెంటనే విచారణ చేపట్టాలని గ్రామ ప్రజల డిమాండ్ "న్యాయం చేయకపోతే ఉద్యమం తప్పదు" అంటూ కూలీల హెచ్చరిక**

గుండ్రాతి మడుగు గ్రామంలోని ఉపాధి కూలీలు తమ ఆవేదన వ్యక్తం చేస్తూ... “పగలు ఎండలో కష్టపడి పని చేస్తున్నాం. కానీ పని చేసిన రోజులు కూడా రికార్డుల్లో కనిపించడం లేదు. వేతనాలు రావడం లేదు. కుటుంబాలను పోషించడానికి అప్పులు చేసి బతికే పరిస్థితి వచ్చింది,” అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.



కొందరు కూలీలు తమ జాబ్ కార్డుల్లో నమోదైన హాజరు వివరాలను చూపిస్తూ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్, విజిలెన్స్ అధికారులు వెంటనే స్పందించి గుండ్రాతి మడుగులో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మస్టర్ రోల్స్, జాబ్ కార్డులు, బ్యాంక్ ఖాతాల లావాదేవీలను పరిశీలించి నిజాలను వెలికితీయాలని కోరుతున్నారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకుని, పేద కూలీలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. “ఉపాధి హామీ పథకం పేదల హక్కు... దాన్ని దోపిడీ కేంద్రంగా మార్చిన వారిని ప్రభుత్వం వదిలిపెట్టొద్దు. వెంటనే చర్యలు తీసుకోకపోతే గ్రామ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున నిరసనలు చేపడతాం,” అంటూ గ్రామ ప్రజలు హెచ్చరించారు.

## బాటసింగారం రైతు సేవ సహకార సంఘం 58వ మహాజన సభకు ఏర్పాట్లు

**శనివారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం – రైతులు, డైరెక్టర్లు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపు**



**అబ్దుల్లాపూర్‌మెట్ , విశాల భారతి :** అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని బాటసింగారం రైతు సేవ సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 58వ మహాజన సర్వసభ్య సమావేశానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 30052026 శనివారం ఉదయం 11 గంటలకు బాటసింగారం రైతు సేవా సహకార సంఘం కార్యాలయ ఆవరణంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సంఘానికి సంబంధించిన వార్షిక కార్యకలాపాలు, రైతుల సంక్షేమ కార్యక్రమాలు, సహకార రంగ అభివృద్ధి, సభ్యుల సమస్యలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. రైతు సేవ సహకార సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను మరింత విస్తరించేందుకు సభ్యుల సూచనలు, అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు చెప్పారు. రైతులకు అవసరమైన రుణ సదుపాయాలు, వ్యవసాయ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై కూడా సమావేశంలో సమగ్రంగా చర్చించనున్నట్లు వెల్లడించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని రైతులు, సంఘం డైరెక్టర్లు, సభ్యులు, ప్రజాప్రతినిధులు అందరూ సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతుల ఐక్యతతో సహకార సంఘం మరింత అభివృద్ధి చెందుతుందని, రైతుల ప్రయోజనాల కోసం సంఘం నిరంతరం పనిచేస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో రైతు సహకార సంఘం డైరెక్టర్లు, సంగం మేనేజర్ జక్కుల ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గం చెరువులో గుర్తుతెలియని మహిళ మృతి

**ఎస్‌హెచ్‌వో డి. కృష్ణమోహన్ పర్యవేక్షణలో దర్యాప్తు**



**సైబరాబాద్ విశాల భారతి :** దుర్గం చెరువులో శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. చెరువులో మహిళ పడిందన్న సమాచారంతో మాదాపూర్ ఎస్‌హెచ్‌వో డి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పోలీసు బృందం హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుంది. హైడ్రా సిబ్బంది సహాయంతో చెరువులో గాలింపు చేపట్టగా మహిళ మృతదేహం బయటపడింది. మృతురాలి వయసు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుంది. చామన ఛాయ రంగులో, నలుపు రంగు వెంట్రుకలతో ఉంది. నలుపు రంగు చుడీదార్, క్రీమ్ కలర్ లెగ్గిన్ ధరించి ఉంది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్‌హెచ్‌వో డి. కృష్ణమోహన్ పర్యవేక్షణలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతురాలి గుర్తింపు, ఘటనకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. స్థానిక సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ఆచూకీ కోసం విజ్ఞప్తి: మృతురాలి వివరాలు తెలిసినవారు మాదాపూర్ పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 8712663109 లేదా ఎస్‌హెచ్‌వో డి. కృష్ణమోహన్ సెల్ నంబర్ 8712663100కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ జెండా పండుగ విజయవంతం చేయండి




**టిఆర్ఎస్ పార్టీ నాయకులు బేగరి రాజు పిలుపు**

**మొయినాబాద్ మే 29 (విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మే 20 నుండి జూన్ 20 వరకు నిర్వహిస్తున్న తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ జెండా పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిఆర్ఎస్ పార్టీ నాయకులు బేగరి రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన తెలిపారు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతులు అయిన మహనీయులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా శనివారం తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ మొయినాబాద్‌కు విచ్చేస్తున్నారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండా పండుగను విజయవంతం చేయాలని కోరారు. శనివారం ఉదయం 9 గంటలకు వీసా తిరుపతిగా పేరుపొందిన చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం ఉదయం 10 గంటలకు మొయినాబాద్ చౌరస్తాలో టిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. అక్కడి నుండి సురంగల్ గ్రామంలో టిఆర్ఎస్ నాయకులు గాండ్ల సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నూతన బస్టాండ్ నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ పాల్గొంటారని మీడియాకు వివరించారు.

## ఆల్విన్ కాలనీలో పారిశుద్ధ్య తనిఖీ, నిర్మాణ వ్యర్థాల తొలగింపు

**నివాస సంక్షేమ సంఘంతో సమావేశం, ఫిర్యాదులపై ఆరా**



**కూకట్‌పల్లి, విశాల భారతి:** ఆల్విన్ కాలనీలో శుక్రవారం ఉదయం ఉప కమిషనర్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య తనిఖీ నిర్వహించారు. కాలనీలో పేరుకుపోయిన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ చాముండేశ్వరి సహాయ ఇంజినీరు, పారిశుద్ధ్య సిబ్బంది, పారిశుద్ధ్య క్షేత్ర సహాయకులతో కలసి కాలనీ నివాస సంక్షేమ సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు. కాలనీలో పారిశుద్ధ్య సమస్యలు, స్థానికుల ఫిర్యాదులపై ఆరా తీశారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ చాముండేశ్వరి, సహాయ ఇంజినీరు (ఘన వ్యర్థాల నిర్వహణ), పారిశుద్ధ్య స్పందన సిబ్బంది, పారిశుద్ధ్య క్షేత్ర సహాయకులు, నివాస సంక్షేమ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## చిరుమల్లరాయనపేట మధ్య ట్రాక్టర్ బోల్తా




**విశాల భారత న్యూస్:** కరకగూడెం మండలం చిరుమల్ల గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం కోర్నివల్లి గ్రామానికి చెందిన పూణెం శంకరయ్య ట్రాక్టర్‌తో రాయనపేట వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే ఎస్సై పి.వి. నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను వెలికితీశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

## 275 మంది మహిళలకు చెక్కుల పంపిణీ



**విశాలభారతి:** కరకగూడెం మండలంలో స్వయం శక్తి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. మండల పరిధిలోని 27 గ్రామ సమాఖ్యలకు చెందిన 275 మంది సంఘాల సభ్యులకు పెరటి కోళ్ల పెంపకం కోసం రూ.5.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులకు సంబంధించిన చెక్కులను స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏపీఎం వినోద్ క్రాంతి సమాఖ్య సభ్యులకు అందజేశారు.

## రాజ్యసభ హౌస్ కమిటీ చైర్మన్ డాక్టర్ లక్ష్మణ్‌కు సన్మానం

**మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి :** రాజ్యసభ చైర్మన్, భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ డాక్టర్ కె. లక్ష్మణ్‌ను హౌస్ కమిటీ చైర్మన్‌గా నియమించారని బౌద్ధ నగర్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ తెలిపారు. డాక్టర్ కె. లక్ష్మణ్ గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా చురుకుగా పని చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ మన్ననలు పొందారని ఆమె అన్నారు. చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా శుక్రవారం డాక్టర్ కె. లక్ష్మణ్ ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని స్వరూప గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్, బౌద్ధనగర్ బీజేపీ అధ్యక్షుడు సాయిప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన భగీరథ్ కస్టడీ జైలుకు తరలింపు

**పోక్సో కేసులో నిందితుడికి మూడు రోజుల విచారణ పూర్తి**



మేడ్చల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో భారీగా మోహరించిన పోలీసులు, కోర్టుకు తీసుకొచ్చిన నిందితుడు

**సైబరాబాద్ ,విశాల భారతి:** పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్ పోలీసు కస్టడీ శుక్రవారంతో ముగిసింది. పేట్ బషీరాబాద్ పోలీసులు నిందితుడిని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. విచారణ నిమిత్తం న్యాయస్థానం మూడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతి ఇవ్వగా, గడువు నేటితో పూర్తయింది. కోర్టు ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన భద్రత నడుమ పోలీసులు అతడిని చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. కస్టడీలో నిందితుడి నుంచి విచారణాధికారులు కీలక సమాచారం సేకరించినట్లు తెలిసింది. కేసు దర్యాప్తులో భాగంగా పలు ఆధారాలు, సాంకేతిక సాక్ష్యాలను సేకరించినట్లు సమాచారం. మేడ్చల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఉదయం నుంచే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిందితుడిని తీసుకొచ్చే సమయంలో కోర్టు వద్ద బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు గుమిగూడారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. నిందితుడు భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. తదుపరి విచారణ వాయిదా వేస్తూ న్యాయస్థానం నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

## తెలంగాణ బిడ్డకు కేంద్రంలో మరో కీలక పదవి

**సికింద్రాబాద్, విశాలభారతి :** రాజ్యసభ హౌస్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్ కి కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తిహర్షకిరణ్ డివిజన్ నాయకులతో కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ శుభ సందర్భంగా లక్ష్మణ్ అన్నను మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుండి అంచెలంచెలుగా ఎదిగి, ఈరోజు దేశ రాజధానిలో కీలక బాధ్యతలు చేపట్టడం మనందరికీ ఎంతో గర్వకారణం, స్ఫూర్తిదాయకం లక్ష్మణ్ మార్గ దర్శకత్వంలో ప్రజా సేవలో మరింత ముందుకు సాగుతాం అన్నారు. ఈ కార్యక్రమం లో వనమాల శ్రీనివాస్ , శ్యామ్ ముదిరాజ్, వెంకటేష్ యాదవ్, నాగరాణి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



## నకిలీ జీవోలతో 10 ఎకరాల భూదందా ముఠా గుట్టురట్టు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

**ముగ్గురు అరెస్టు, నలుగురు పరార్**

**సైబరాబాద్ - విశాల భారతి**

ప్రభుత్వ భూమిని తమ పేరిట క్రమబద్ధీకరించినట్లు నకిలీ జీవోలు సృష్టించి, వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తూ కోట్ల రూపాయలకు విక్రయించేందుకు యత్నించిన ముఠా గుట్టును సైబరాబాద్ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో గండిపేట్‌కు చెందిన ముగ్గురు నిందితులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గండిపేట్ మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఈ నెల 23న రాత్రి ఏడున్నర గంటలకు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గండిపేట్ గ్రామం సర్వే నంబర్ 18లోని ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కేటాయించినట్లు ఐదు నకిలీ జీవోల కాపీలు సృష్టించి వాట్సాప్ గ్రూపులు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాలతో నార్సింగి ఇన్‌స్పెక్టర్ జి. హరికృష్ణా రెడ్డి, గచ్చిబౌలి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి. నరేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. కోర్టు నుంచి సెర్చ్ వారెంట్ పొంది గండిపేట్‌కు చెందిన నిమ్మల వేణుగోపాల్, నిమ్మల రామస్వామి, నిమ్మల రాజేష్ ఇళ్లలో గురువారం సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు పాస్ పుస్తకాలు, భూమికి సంబంధించిన అవగాహన ఒప్పంద పత్రాలు, మూడు మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగుచూశాయి. దివంగత దశరథ్ కుమారులు నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల రామస్వామి, కుమార్తె మంగా గండిపేట్ సర్వే నంబర్ 18లోని సుమారు పది ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమి తమ ఆధీనంలో ఉందని చెబుతున్నారు. ఈ భూమిపై హక్కుల కోసం రెవెన్యూ శాఖపై హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేయగా 2025 అక్టోబర్‌లో న్యాయస్థానం వారి పిటిషన్లను కొట్టివేసింది. అయినప్పటికీ ఎలాంటి యాజమాన్య హక్కులు, పట్టా, చట్టబద్ధమైన అధికారం లేకుండానే నిందితులు బొల్ల రమేష్, బ్రహ్మ నాయుడుతో కలిసి నేరపూరిత కుట్రకు తెరతీశారు. తామే పూర్తి యజమానులమని, చట్టబద్ధమైన హక్కులు ఉన్నాయని నమ్మించి ఎకరం మూడున్నర కోట్ల రూపాయల చొప్పున మొత్తం పది ఎకరాలను విక్రయించేందుకు సిద్ధపడ్డారు. ఇందుకు గాను నిమ్మల కుటుంబ సభ్యులు, బొల్ల రమేష్, బ్రహ్మ నాయుడుల మధ్య అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఈ లావాదేవీ ద్వారా ప్రభుత్వానికి నష్టం, తమకు లాభం చేకూర్చుకోవాలని పథకం వేశారు. ఈ భూ ఒప్పందం కోసం నిమ్మల కుటుంబ సభ్యులు రెండో పార్టీ నుంచి సుమారు నాలుగు కోట్ల రూపాయలు ముందస్తుగా తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ మొత్తం వ్యవహారంలో సునీల్, రాధాకృష్ణ, మరికొందరు మధ్యవర్తులుగా వ్యవహరించారు. వీరంతా ప్రస్తుతం పరారీలో ఉన్నారు. కొనుగోలుదారులను నమ్మించేందుకు నిందితులు నిమ్మల వేణుగోపాల్, అతని కుటుంబ సభ్యులు, బొల్ల రమేష్, బ్రహ్మ నాయుడు, సునీల్, రాధాకృష్ణ కలిసి నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు, నకిలీ పత్రాలు సృష్టించారు. ప్రభుత్వమే సర్వే నంబర్ 18లోని పది ఎకరాల భూమిని తమ పేరిట క్రమబద్ధీకరించి కేటాయించినట్లు ఆ పత్రాల్లో చూపించారు. ఈ కేసులో శుక్రవారం నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం వారికి రిమాండ్ విధించడంతో చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు బొల్ల రమేష్, బ్రహ్మ నాయుడు, సునీల్, రాధాకృష్ణతో పాటు మరికొందరి కోసం నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. నకిలీ జీవోలు, నకిలీ భూ పత్రాలు, వాట్సాప్, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ధ్రువీకరించని సమాచారాన్ని నమ్మి మోసపోవద్దని సైబరాబాద్ పోలీసులు ప్రజలను కోరారు. భూములు కొనే ముందు సంబంధిత రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల కార్యాలయాల్లో యాజమాన్యం, టైటిల్ రికార్డులను తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. భూ కబ్జాలు, నకిలీ పత్రాల సృష్టి, మోసం, ప్రభుత్వ పత్రాల నకిలీకి పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




పరారీలో ఉన్న నలుగురు నిందితులు 1. బ్రహ్మానాయుడు, 2. సునీల్ గౌడ్, 3. రాధాకృష్ణ, బొల్ల రమేష్. (ఫైల్)


990

GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Lands – Ranga Reddy District - Regularization of Kamanu Nageswararao on payment of the government fee of the market value to an extent of Ac. 01.20 Gts in Sy. No: 18/2/1 which is situated at Gandipet Village (V) & Mandal (M), Ranga Reddy District (D) for the rupees of 33,07,501/- through vide Demand Draft (DD) No: 008512 dated: 21.11.2025 & the rupees of 2,00,583/- through vide Demand Draft (DD) No: 000208 dated: 05.12.2025.

REVENUE (LAND ADMINISTRATION.III) DEPARTMENT

G.O.Ms.No.558 Dated: 02.12.2025
Read the following

1. A/o of the Kamanu Nageswararao dated: 01.10.2025
2. Tahsildar Lr. No. 110/MOI/2025, Dated.28.10.2025
3. Report of the District Collector Lr. No.96/RR/CC/2025, Dated: 06.11.2025
4. CCLA Proc. No.319/CCLA/2025, Dated: 24/11/2025
5. G.O.MS No:92 dated: 26.05.2016 of Revenue (ULC) Dept, Government of Telangana.

&&&

ORDER:-

The following order with respect to the land to an extent of Ac. 01.20 Gts in Sy. No: 18/2/1 which is situated at Gandipet Village (V) & Mandal (M), Ranga Reddy District (D) -Orders - Issued.

All the above reference cited, Orders have been to issue the Regularization of land in favour of Kamanu Nageswararao and filed an application for regularization and succession of the land to an extent of Ac. 01.20 Gts in Sy. No: 18/2/1 which is situated at Gandipet Village (V) & Mandal (M), Ranga Reddy District (D) and regularization of the and to an extent of Ac. 01.20 Gts in Sy. No: 18/2/1 which is situated at Gandipet Village (V) & Mandal (M), Ranga Reddy District (D) with liberty to applicant and possessor namely Kamanu Nageswararao after payment of the regularization fee of the total scheduled property on payment of the government fee of the market value i.e. rupees 33,07,501/- through vide Demand Draft (DD) No: 008512 dated: 21.11.2025 & the rupees of 2,00,583/- through vide Demand Draft (DD) No: 000208 dated: 05.12.2025 in the form of Demand Draft on the name of "Bhoo Bharathi Projects".

(BY ORDER AND IN THE NAME OF THE PRINCIPAL SECRETARY TO THE GOVERNMENT OF TELANGANA).

D.S. LOKESH KUMAR, IAS
PRINCIPAL SECRETARY TO THE GOVERNMENT

Copy to:
The Commissioner, CCLA Nampally Hyderabad.
The Collector, Ranga Reddy District.
Kamanu Nageswararao.

//FORWARDED: BY ORDER //

# నాణ్యమైన వైద్య సేవలతో ఆదిలాబాద్ రిమ్స్‌కు కొత్త వెలుగు





- నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం
- డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్ నేతృత్వంలో అభివృద్ధి పథంలో రిమ్స్

**ఆదిలాబాద్, విశాలభారతి:**



ఒకప్పుడు వైద్య సేవల కోసం హైదరాబాద్, నిజామాబాద్, నాగ్‌పూర్ వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదుర్కొన్న ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు నేడు రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) ఆశాకిరణంగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రి అంటే నిర్లక్ష్యం, సదుపాయాల కొరత అనే అపోహలను చెరిపేస్తూ రిమ్స్ ఆసుపత్రి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటోంది. ఈ మార్పుకు ప్రధాన కారణంగా నిలిచింది డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్ నాయకత్వం. డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆసుపత్రి అభివృద్ధి, సేవల విస్తరణ, వైద్య ప్రమాణాల పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించిన డాక్టర్ జైసింగ్ రిమ్స్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ ప్రభుత్వ వైద్య సంస్థగా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తున్నారు. ఆయన నాయకత్వంలో ఆసుపత్రి రూపురేఖలు మారిపోవడమే కాకుండా ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై కొత్త నమ్మకం పెరిగింది.

**గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు చేరువైన వైద్యం**

ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో కూడుకుని ఉండటంతో ప్రజలు మెరుగైన వైద్య సేవలు పొందడంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. దీనివల్ల సమయం, డబ్బు వృథా కావడంతో పాటు ప్రాణాపాయం కూడా ఏర్పడేది.

ఈ సమస్యను గుర్తించిన డాక్టర్ జైసింగ్ జిల్లా ప్రజలకు స్థానికంగానే అత్యుత్తమ వైద్య సేవలు అందేలా కార్యాచరణ రూపొందించారు. గ్రామీణ ప్రజలకు సైతం కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోని వైద్య సేవలు అందించేలా ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచారు. ప్రత్యేక వైద్య విభాగాలను బలోపేతం చేయడంతో పాటు అత్యవసర సేవలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దారు.

**ఆధునిక వైద్య సదుపాయాలతో కొత్త గుర్తింపు**

రిమ్స్ ఆసుపత్రిలో ఇటీవల కాలంలో ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, కొత్త సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరిగింది. గతంలో ఇతర నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న అనేక పరీక్షలు, చికిత్సలు ఇప్పుడు రిమ్స్‌లోనే అందుబాటులోకి వచ్చాయి. వివిధ ప్రత్యేక వైద్య విభాగాలను అభివృద్ధి చేయడంతో పాటు నిపుణులైన వైద్యుల సేవలను మరింత విస్తరించారు. రోగుల అవసరాలకు అనుగుణంగా అత్యవసర చికిత్సలు, శస్త్రచికిత్సలు, ప్రత్యేక వైద్య సేవలు వేగంగా అందించేలా వ్యవస్థను బలోపేతం చేశారు.

**రోగుల విశ్వాసాన్ని గెలుచుకున్న ప్రభుత్వ ఆసుపత్రి**

ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో ఉన్న ప్రతికూల భావనను రిమ్స్ పూర్తిగా మార్చేసింది. పరిశుభ్రమైన వాతావరణం, సమయానికి వైద్య పరీక్షలు, నిపుణులైన వైద్యుల సేవలు, అవసరమైన మందుల లభ్యత, సిబ్బంది మర్యాదపూర్వక వైఖరి వంటి అంశాలు రోగుల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయి. దీంతో ఆదిలాబాద్ జిల్లాతో పాటు నిర్మల్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల తదితర పొరుగు జిల్లాల నుంచి కూడా వేలాది మంది రోగులు రిమ్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే నాణ్యమైన వైద్యం అందుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**వైద్య విద్యకు ప్రాధాన్యం**

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కాకుండా వైద్య విద్యా ప్రమాణాలను పెంపొందించడంపైనా డాక్టర్ జైసింగ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వైద్య విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ, ఆధునిక వైద్య పరిజ్ఞానంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా వైద్యులు, నర్సులు, సిబ్బందికి నిరంతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సేవల నాణ్యతను మరింత పెంచుతున్నారు. రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు అవసరమైన నైపుణ్యాలను సిబ్బందిలో పెంపొందించే చర్యలు చేపడుతున్నారు.

**సేవలే లక్ష్యంగా ముందుకు**

"ప్రజారోగ్యమే పరమావధి" అనే భావనతో డాక్టర్ రాథోడ్ జైసింగ్ సేవలు అందిస్తున్నారని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. నిరుపేదలకు ఉచితంగా, నాణ్యమైన వైద్యం అందించడమే తన లక్ష్యమని ఆయన ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తున్నారు. ఆసుపత్రిలో ప్రతి రోగికి సమాన ప్రాధాన్యం కల్పిస్తూ సేవలందించాలనే దృక్పథంతో పనిచేస్తున్నారు. ఆయన నాయకత్వంలో రిమ్స్ ఆసుపత్రి కేవలం వైద్య సేవల కేంద్రంగానే కాకుండా ప్రజల నమ్మకానికి ప్రతీకగా నిలుస్తోంది.

**ప్రజల ప్రశంసలు**

రిమ్స్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సేవల మెరుగుదల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఇతర నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండగా ఇప్పుడు స్థానికంగానే నాణ్యమైన వైద్యం అందుతుండటంతో ప్రజలు డాక్టర్ జైసింగ్ నాయకత్వాన్ని అభినందిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి అంటే నిర్లక్ష్యం అనే భావనను తొలగించి, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న సంస్థగా ఆదిలాబాద్ రిమ్స్ ఎదుగుతోంది. నిరుపేదలకు అండగా నిలుస్తూ, అత్యాధునిక వైద్య సేవలను అందిస్తూ రాష్ట్రంలోనే ఆదర్శ ప్రభుత్వ వైద్య సంస్థగా నిలిచే దిశగా రిమ్స్ వేగంగా ముందుకు సాగుతోంది. "నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే మా ధ్యేయం" అనే సంకల్పంతో డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్ చేస్తున్న కృషి నేడు వేలాది మంది రోగుల జీవితాల్లో కొత్త ఆశలను నింపుతోంది.

# సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమ్మె సరికాదు

- బిల్డర్స్ అసోసియేషన్
- మాదాపూర్‌లో గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం



గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మిరియాల రాఘవరావు

**శేరిలింగంపల్లి విశాల భారతి:** నిర్మాణ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు రేట్ల పెంపు కోరుతూ సమ్మెకు దిగడం సమంజసం కాదని గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ పేర్కొంది. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో శుక్రవారం అసోసియేషన్ కార్యనిర్వాహక వర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమ్మెతో పాటు నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. అసోసియేషన్ చైర్మన్ మిరియాల రాఘవరావు మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా రేట్లు పెంచాలని సెంట్రింగ్ కాంట్రాక్టర్లు సమ్మె చేయడం సరికాదని అన్నారు. నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వారు వెంటనే సమ్మె విరమించాలని కోరారు.అధ్యక్షుడు కె. రాజా రెడ్డి మాట్లాడుతూ ఒకవైపు కొనసాగుతున్న యుద్ధాల కారణంగా నిర్మాణ సామగ్రి ధరలు పెరుగుతుండగా, మరోవైపు సెంట్రింగ్ సమ్మెతో చిన్న బిల్డర్లు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ స్వప్న శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సమయంలో ప్రభుత్వం మార్కెట్ విలువలను పెంచేందుకు చేస్తున్న ప్రయత్నాలు నిర్మాణ రంగానికి మరింత ఇబ్బందికరంగా మారుతాయని, చదరపు అడుగు రేట్లు పెరగకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ప్రధాన కార్యదర్శి పి.బి.ఎస్. విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ పరిస్థితి అధ్వానంగా ఉందని తెలిపారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత కూడా ట్రాన్స్‌ఫార్మర్లు పొందడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీనివల్ల కస్టమర్ల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరును ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌తో ముడిపెట్టకుండా పనులు జరిగేలా చూడాలని కోరారు. అలాగే దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో రిజిస్ట్రేషన్ చార్జీల శాతాన్ని తగ్గించినట్లు ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించి వినియోగదారులకు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. టెక్నికల్ అడ్వైజర్ సుమా రామకృష్ణ మాట్లాడుతూ బిల్డింగ్ పర్మిషన్ సమయంలో ప్రభుత్వం వసూలు చేస్తున్న లేబర్ సెస్ నిధుల నుంచి సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలని కోరారు.ఈ సమావేశంలో పులి మురళి, ఉపేందర్ రెడ్డి, చక్రపాణి, వాసుదేవరావు, రామకృష్ణ, విజయ ప్రతాపరెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ స్టేట్ పాలిటెక్నిక్ ప్రథమ ర్యాంకర్‌కి ఘన సన్మానం

- రాష్ట్ర ప్రథమ ర్యాంకుతో సత్తుపల్లికి కీర్తి
- విద్యార్థితో పాటు తండ్రికి ప్రత్యేక సత్కారం
- ప్రతిభ గల విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న ఎమ్మెల్యే

**విశాలభారతి , సత్తుపల్లి :** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన "ప్రజా పాలన ఇందిరా మహిళా శక్తి" కార్యక్రమం సరికొత్త స్ఫూర్తికి వేదికైంది. తెలంగాణ రాష్ట్ర పాలిటెక్నిక్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి, సత్తుపల్లి నియోజకవర్గానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన విద్యార్థి మహమ్మద్ అర్బాజ్ అలీని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ విద్యార్థి అర్బాజ్ అలీకి శాలువా కప్పి అభినందించారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి పట్టుదల, క్రమశిక్షణతో చదివి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం సత్తుపల్లి ప్రాంతానికే గర్వకారణమని కొనియాడారు.

**తండ్రి పట్టుదలకు దక్కిన గౌరవం:**




కుమారుడి ఉన్నత చదువుల కోసం నిరంతరం శ్రమించిన అర్బాజ్ అలీ తండ్రి మహమ్మద్ అఫ్జల్‌ను కూడా ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సత్కరించారు. పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని, అర్బాజ్ అలీ లాంటి యువతకు ఈ విజయం గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "సత్తుపల్లి మట్టిలో ఎంతోమంది మేధావులు, ప్రతిభావంతులు ఉన్నారనడానికి అర్బాజ్ అలీ విజయం నిదర్శనం. ఇలాంటి విద్యార్థులను ప్రోత్సహించడం మనందరి బాధ్యత. అర్బాజ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి సేవ చేయాలి. ప్రభుత్వం తరపున ప్రతిభ గల విద్యార్థులకు ఎల్లప్పుడూ పూర్తి మద్దతు ఉంటుంది. విజనరీ కోచింగ్ సెంటర్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి సత్తుపల్లి ప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్‌పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత వేణు, మున్సిపల్ కమిషనర్ నరసింహన్, చల్లగుల్ల నరసింహారావు, విజనరీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు జొన్నలగడ్డ రాజు, కంచపోగు గోపాలరావు, ఖమ్మంపాటి రామకృష్ణ, కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని అర్బాజ్ అలీకి శుభాకాంక్షలు తెలిపారు.

# ఖమ్మంలో చికిత్స పొందుతున్న పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా

- బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచన
- ప్రమాద బాధితులకు పరామర్శ
- కుటుంబ సభ్యులకు మనోధైర్యం
- వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా





**విశాలభారతి , అశ్వారావుపేట:** అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఖమ్మంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.దమ్మపేట మండలం లింగాలపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ యువ నాయకుడు లాలు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఖమ్మంలోని యలమద్ది ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. తాటిసుబ్బన్నగూడెం సర్పంచ్ సవలం స్వాతి భర్త సవలం రవి ఖమ్మంలోని ఇండస్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకోగా, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.ఖమ్మంకి చెందిన బైరు అప్పారావు ఇటీవల లిఫ్ట్ ప్రమాదంలో గాయపడి స్థంబాద్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పరామర్శించి మనోధైర్యం కల్పించారు.చంద్రుగొండకు చెందిన తంబళ మంగయ్య కుమారుడు వంశీ ఖమ్మంలోని స్థంబాద్రి ఆసుపత్రిలో కిడ్నీ సంబంధిత ఆపరేషన్ చేయించుకోగా, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో హరికృష్ణ, తాటి ప్రదీప్ చంద్ర (దీపు), మాజీ సర్పంచ్ తాటి అశోక్, మండవ సత్య, తాటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# గుండుతో గల్లంతైన హాజరు..!

**మహిళ జుట్టుతో పడిన అటెండెన్స్..!**
**గుండుతో గుర్తించని NMMS యాప్.**

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:**



మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే ఉపాధి హామీ కూలీ ఇటీవల కొండగట్టు అంజన్న స్వామిని దర్శించుకొని మొక్కుబడిగా తలనీలాలు సమర్పించాడు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు హాజరయ్యాడు. అయితే హాజరు నమోదు సమయంలో అతనికి ఊహించని సమస్య ఎదురైంది. ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (NMMS) యాప్ అతని ముఖాన్ని గుర్తించలేకపోయింది. తలపై జుట్టు లేకపోవడంతో పలుమార్లు ఫోటోలు తీసినా అటెండెన్స్ నమోదు కాలేదు. దీంతో అక్కడున్న కార్మికులు ఆశ్చర్యానికి గురయ్యారు.

**మహిళ జుట్టుతో 'కవర్'..**
**వెంటనే హాజరు నమోదు.**

హాజరు పడకపోవడంతో శ్రీనివాస్ ఓ వినూత్న ఆలోచన చేశాడు. పక్కనే నిలబడ్డ మహిళా కూలీ జుట్టును తన గుండుపైకి వచ్చేలా కప్పి మళ్లీ ఫోటో దిగాడు. ఆశ్చర్యకరంగా.. అంతసేపు మొరాయించిన సాఫ్ట్వేర్ ఈసారి వెంటనే అతని ముఖాన్ని గుర్తించి హాజరును నమోదు చేసింది. కోట్లాది రూపాయలతో రూపొందించిన సాంకేతిక వ్యవస్థను ఒక సాధారణ కూలీ తెలివి మించిపోయిందని అక్కడున్నవారు చర్చించుకున్నారు. ఈ ఘటన చూసిన కూలీలు నవ్వుల్లో మునిగిపోయారు.

**వైరల్ వీడియోతో అధికారులపై ప్రశ్నలు.**

ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "కోట్ల సాఫ్ట్వేర్‌కు మహిళ జుట్టే పరిష్కారం చూపించింది", "టెక్నాలజీని మించిన కూలీ తెలివి" అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ గుర్తింపు వ్యవస్థలో ఉన్న లోపాల వల్ల అమాయక కార్మికుల హాజరు నమోదుకాక కూలి డబ్బులు ఆగిపోతున్నాయని చెబుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి NMMS యాప్‌లోని లోపాలను సరిచేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

# సింగరేణి ఏరియా ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నాం

- కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం పెద్దపీట
- రామగుండం ఏరియా ఆసుపత్రిలో అధునాతన కార్డియాక్ క్యాథ్‌లాబ్
- ఏరియా ఆసుపత్రిలో కార్పొరేట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్

**విశాలభారతి, రామకృష్ణాపూర్:** సింగరేణి యాజమాన్యం కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా వైద్య సేవలను మరింత మెరుగుపరుస్తుందని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ అన్నారు. శుక్రవారం రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, ఆస్పత్రి అంతా కూడా పరిశుభ్రంగా ఉందని రోగులు తెలపడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీవైసీఎంఓ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం విషయంలో సింగరేణి యాజమాన్యం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయదని అయన స్పష్టం చేశారు. కార్పొరేట్ వైద్యం అందించేలా కీలక మార్పులు తీసుకువస్తూ ఆసుపత్రులకు అవసరమైన అన్ని రకాల వసతులను సింగరేణి యాజమాన్యం అన్ని సమకూరుస్తోందని తెలిపారు. దీనిలో భాగంగానే ఇటీవల ఆర్కేపీ ఏరియా ఆసుపత్రికి సరికొత్త అధునాతన వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. వైద్యుల కొరతను అధిగమించేందుకు స్పెషలిస్ట్ వైద్యుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని, అలాగే జనరల్ డ్యూటీ వైద్యుల నియామకాలు కూడా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నియామకాలు పూర్తయితే కార్మికులకు మరింత మెరుగైన వైద్య సేవలు, కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**రామగుండంలో ఏరియా ఆసుపత్రిలో కార్డియాక్ క్యాత్ లాబ్**

ఇటీవల కాలంలో సింగరేణి కార్మికులు కార్మిక కుటుంబాలు గుండె జబ్బుల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందన్నారు. వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యవసర సమయాల్లో కార్మికులకు తక్షణ వైద్యం అందించేందుకు రామగుండం ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేకంగా అధునాతన కార్డియాక్ క్యాథ్‌లాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యంతో చర్చించి త్వరలోనే దీనిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. గుండెపోటు వచ్చిన తొలిగంటలో క్యాథ్‌లాబ్ ద్వారా చికిత్స అందిస్తే 99 శాతం రోగుల ప్రాణాలను కాపాడవచ్చని ఆయన వివరించారు. కార్మికుల్లో సింగరేణి వైద్య వ్యవస్థపై నమ్మకాన్ని, సానుకూల దృక్పథాన్ని పెంపొందించడంలో యాజమాన్యంతో పాటు మీడియా పాత్ర కూడా కీలకమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆస్పత్రి అందిస్తున్న వైద్య సేవలపై మీడియా మిత్రులు నివృత్తి చేసుకొని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మీడియా మిత్రులు అందించే వార్తలు సింగరేణి కార్మికులు, కార్మిక కుటుంబాలకు కీలకమని స్పష్టం చేశారు. సింగరేణి ఏరియా ఆసుపత్రిలో అందిస్తున్న కార్పొరేట్ వైద్యాన్ని కార్మికులు కార్మిక కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీ.వై.సీ.వై.ఓ మధు కుమార్, సీనియర్ పిఓ మదర్ సాహెబ్, మ్యాట్రన్ విజయలక్ష్మి ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కురవి సింగరాయకుంటలో కోట్ల నల్లరేగడి దందా..!





- అధికారుల మౌనంతో రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- పర్మిషన్లు లేకుండానే జేసీబీలతో భారీ తవ్వకాలు.
- రోడ్లు ధ్వంసం.. రైతుల్లో ఆగ్రహం
- సింగరాయకుంటను మింగేస్తున్న మట్టి మాఫియా..!
- అధికారుల మౌనంపై రైతుల ఆగ్రహం – కలెక్టర్ విచారణకు డిమాండ్..!

**కురవి విశాల భారతి:**



కురవి మండల పరిధిలోని మొగిలిచర్ల - రేగుల తండా ప్రధాన రహదారి సమీపంలోని సింగరాయకుంట ప్రస్తుతం అక్రమ నల్లరేగడి దందాకు కేంద్రంగా మారిందనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కోట్ల రూపాయల విలువ చేసే నల్లరేగడి మట్టిని భారీ జేసీబీలు, లారీల సహాయంతో రాత్రింబవళ్లు ఇటుక బట్టీలకు తరలిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామస్తుల కథనం ప్రకారం, ఈ తవ్వకాలకు గ్రామపంచాయతీ అనుమతులు లేవు. అంతేకాకుండా ఇరిగేషన్, మైనింగ్ శాఖల అధికారిక పర్మిషన్లు కూడా తీసుకోకుండా అక్రమంగా తవ్వకాలు కొనసాగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "అన్ని పర్మిషన్లు ఉన్నాయి" అంటూ జిల్లాకు చెందిన కొందరు వ్యక్తులు అధికారుల పేర్లు చెప్పుకుంటూ భారీ యంత్రాలతో మట్టి తవ్వకాలు చేపడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నాలుగు ఎకరాల్లో 15 పీట్ల లోతుతో గుంతలు..!**

సాధారణంగా స్కేల్ ప్రకారం పరిమిత మట్టిని మాత్రమే తీయాల్సి ఉండగా, సింగరాయకుంటలో మాత్రం నాలుగు ఎకరాలకు పైగా విస్తీర్ణంలో దాదాపు 15 పీట్ల లోతుతో భారీ గుంతలు తవ్వినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అక్రమ తవ్వకాల కారణంగా చెరువు పరిసర ప్రాంతం పూర్తిగా దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటుక బట్టీలకు తరలిస్తున్న ఈ మట్టికి సంబంధించి ప్రభుత్వ ఖజానాకు ఎంత ఆదాయం చేరింది..? అసలు ఎవరి పేరుతో అనుమతులు తీసుకున్నారు..? ఎస్టిమేషన్ ఎంత..? ఇప్పటివరకు ఎంత మట్టి తరలించారు..? అనే ప్రశ్నలకు సమాధానాలు లేకుండానే దందా కొనసాగుతుండటం అనుమానాలకు తావిస్తోంది. అక్రమంగా మట్టి తరలిస్తున్న యజమానిని కొందరు గ్రామస్తులు నిలదీయగా, గ్రామపంచాయతీకి చెందిన కొందరు వార్డ్ మెంబర్లు రంగంలోకి దిగి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధుల సహకారం లేకుండా ఇంత పెద్ద ఎత్తున దందా జరగదని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

**భారీ లారీలతో రోడ్లు చిద్రమ్... రైతుల ఆందోళన.**

ప్రతి రోజు డజన్ల కొద్దీ భారీ లారీలతో మట్టి రవాణా జరుగుతుండటంతో డోర్నకల్ ప్రధాన తారు రహదారి పూర్తిగా దెబ్బతింది. రోడ్డంతా పెద్ద పెద్ద చీలికలు ఏర్పడి ప్రయాణికులకు ప్రమాదకరంగా మారిందని వాహనదారులు చెబుతున్నారు. పంట పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. "ప్రభుత్వ భూములను కొల్లగొడుతూ కోట్ల రూపాయల మట్టి దందా జరుగుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదు..? ఈ అక్రమ తవ్వకాల వెనుక ఎవరి అండ ఉంది..?" అంటూ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతున్నప్పటికీ సంబంధిత శాఖలు స్పందించకపోవడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. సింగరాయకుంట నల్లరేగడి దందాపై జిల్లా కలెక్టర్, మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు వెంటనే ప్రత్యేక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. "పర్మిషన్ ఉంటే చూపించండి... లేకపోతే దందా ఆపండి" కురవి మండల ప్రజలు డిమాండ్.



# ఈ అభిమానం ఇలాగే ఉండాలి

శ్రద్ధాకపూర్ కొత్త రికార్డును నమోదు చేసింది. మే 2026 లెక్కల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన కథానాయికగా ఆమె అవతరించింది. తాజాగా బయటకొచ్చిన అత్యధిక ఫాలోవర్లు కలిగిన టాప్ హీరోయిన్ల అధికారిక ఇన్‌స్టా జాబితాలో, మిగతా స్టార్ హీరోయిన్లందరినీ వెనక్కి నెట్టి, ఏకంగా 93 మిలియన్లు అనగా, 9కోట్ల 3లక్షల ఫాలోవర్లతో టాప్‌లో నిలిచింది శ్రద్ధాకపూర్. ఈ పోటీలో శ్రద్ధాకు.. ప్రియాంక చోప్రా గట్టి పోటీనే ఇచ్చింది. 92 మిలియన్ల ఫాలోవర్లతో ఆమె రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈ విజయంపై ఇన్‌స్టా ద్వారా శ్రద్ధా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'మీ అభిమానమే నాకు కొండంత బలం. ఈ అభిమానం కలకాలం ఇలాగే ఉండాలి' అని పేర్కొన్నది. ఎప్పటికప్పుడు మారే ఈ నంబర్ల రేస్‌లో ఈసారి మాత్రం శ్రద్ధా కపూర్ నంబర్‌వన్ అనిపించుకుంది. వచ్చే ఏడాది ఈ స్థానంలో మరో హీరోయిన్ ఉండొచ్చు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.